సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
బుధవారం, 19.11.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 012
పేజీలు: 08 వెల: రూ. 5



టీమ్ రేవంత్ 2.0

కేబినెట్ విస్తరణకు రాహుల్ గాంధీ గ్రీన్ సిగ్నల్?



- కేబినెట్‌లో భారీ ప్రక్షాళనకు రంగం సిద్ధం!
- మంత్రుల పనితీరుపై అధిష్టానం ఆరా..
- ముగ్గురికి ఉద్వాసన తప్పదా?
- ఖాళీగా ఉన్న పోస్టుల కోసం ఆశావహుల ఎదురుచూపులు
- కూర్పుపై రేవంత్ కు పెరిగిన స్వేచ్ఛ
- ఆయన నిర్ణయాలకే ఢిల్లీ పెద్దల ప్రాధాన్యం!

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక రాజకీయ మార్పులకు రంగం సిద్ధమవుతోందా? మూడేళ్ల పాలన మైలురాయికి చేరుకుంటున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నారా? కేబినెట్ విస్తరణతో పాటు భారీ ప్రక్షాళనకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఈ ప్రశ్నలే హాట్ టాపిక్‌గా మారాయి. హైదరాబాద్ వేదికగా జరిగిన భారత్ సమ్మిట్–2026 సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులతో జరిగిన ప్రత్యేక భేటీ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా రాహుల్, రేవంత్ మధ్య కనిపించిన సాన్నిహిత్యం, రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి పట్టు మరింత బలపడిందనే సంకేతాలను ఇచ్చింది.


మార్పులకు కొండా రాజీనామా ఆజ్యం?
2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది జూన్‌లో ముగ్గురు కొత్త మంత్రులకు అవకాశం కల్పించారు. అయినప్పటికీ కేబినెట్‌లో ఇంకా 3 స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. మరోవైపు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ రాజీనామా పరిణామం, కొందరు మంత్రుల పనితీరుపై అధిష్టానానికి అందిన నివేదికలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మూడేళ్ల పాలన పూర్తవుతున్న నేపథ్యంలో మిగిలిన రెండేళ్లలో ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చడంపై రేవంత్ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పనితీరు ఆధారంగా కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు చేయడంతో పాటు, మరికొందరికి ఉద్వాసన పలికే అవకాశాలున్నాయనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

రేవంత్ నిర్ణయాలకే ఢిల్లీ పెద్దల ప్రాధాన్యత!
ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆసక్తికరమైన అంశం రేవంత్ రెడ్డికి అధిష్టానం వద్ద పెరిగిన ప్రాధాన్యత. ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో సీనియర్లు, జూనియర్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య సమన్వయం కోసం ఢిల్లీ పెద్దల సూచనలకు ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు తన నాయకత్వంపై అధిష్టానంలో మరింత విశ్వాసం పెంచుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల పాలన, పార్టీ కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చే ప్రయత్నాలు రేవంత్‌కు కలిసొచ్చిన అంశాలుగా కనిపిస్తున్నాయి. రాహుల్, మల్లికార్జున ఖర్గేలతో పెరిగిన సమన్వయం నేపథ్యంలో కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు, పీసీసీ సంస్థాగత నిర్ణయాల్లో సీఎం అభిప్రాయానికి అధిక మిగతా 02లో

గ్లోబల్ ఎకానమీలో **భారత్**

సరికొత్త రికార్డు!

చైనా, అమెరికాను వెనక్కి నెట్టిన ఇండియా



- ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య భారత్ నిలకడకలిగిన ఆర్థిక వ్యవస్థగా అవతరణ
- 2026–30 కాలానికి గానూ చైనా, అమెరికాను వెనక్కి నెట్టి 71 స్కోరుతో తొలి ర్యాంకు
- రియల్ జీడీపీ వృద్ధి, తలసరి ఆదాయ వృద్ధి, పొదుపులో భారత్ అగ్రస్థానం
- అసోచామ్, ఐఎంఎఫ్ గణాంకాలను ఉటంకిస్తూ 'ఇన్ఫోఇన్‌డేటా' వెల్లడి
- పటిష్ఠ దేశీయ డిమాండ్, ఎగుమతుల వృద్ధి దేశాన్ని ఆదుకున్నాయన్న ఆర్బీఐ

2

ఆర్థిక విపత్తు అంచున **భారత్**

కొలంబియాలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



- దేశంలో నిరుద్యోగం తీవ్రంగా ఉంది
- యువతకు భవిష్యత్తు పై భరోసా లేదు
- దేశ ఆర్థిక వెన్నెముక విరిగిపోయింది
- తయారీ రంగం బలోపేతం కాకుంటే కష్టమే
- కేంద్రంపై రాహుల్ విమర్శలు

2

కూటమి ఐక్యతే లక్ష్యం

చంద్రబాబు దిశానిర్దేశం



- పాత్తు ధర్మం పాటించాలి
- ప్రతి వార్డులోనూ కూటమి జెండా ఎగరాలి
- నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- ఒక్క వార్డులో ఓడినా కారణాలు విశ్లేషిస్తా

2

నేడు ఇందిరమ్మ కుటుంబ

బీమా ప్రారంభం




- దరఖాస్తులపై సీఎస్ కీలక ఆదేశాలు
- కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా
- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబర్ 18లోగా నమోదు పూర్తి
- 18–59 ఏళ్ల వారికి బీమా అవకాశం
- ప్రతి కుటుంబంలో ఒక్కరికే బీమా

2

నిధులివ్వకుంటే

కురుక్షేత్రమే

సీఎంకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరిక



- కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల పంపకాలపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లకే పెద్దపీట వేస్తున్నారని విమర్శ

2

సాగర్ డెడ్ స్టోరేజీపై కన్ను?

నాగార్జున సాగర్‌కు ఏపీ సొరంగం..

- తెలంగాణకు తెలియకుండానే పనులు
- రూ.1,200 కోట్లతో ఏపీ సొరంగం
- సాగర్ జలాల తరలింపునకు కొత్త ప్లాన్
- మరో జలవివాదానికి తెరలేపిన ఏపీ?

ముద్ర, తెలంగాణ బ్యూరో :
నాగార్జునసాగర్ జలాల వినియోగంపై మరోసారి తెలంగాణ, ఏపీ మధ్య వివాదం తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది. తాగునీటి ప్రాజెక్టు పేరుతో నాగార్జునసాగర్ కుడివైపు ఏపీ ప్రభుత్వం సొరంగం, పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సమాచారం. తెలంగాణకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఈ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. సుమారు రూ.1,200 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీలో ఉన్న కృష్ణా జలాలను సైతం తరలించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. తాగునీటి అవసరాల కోసం జల్ జీవన్ మిషన్ కింద ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా రోజుకు 160 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. సాగర్ ఏపీ వైపు దాదాపు ఏడాది



కాలంగా నిర్మాణ పనులు జరుగుతోంది. తెలంగాణ సరిహద్దుకు కూతవేటు దూరంలోనే రేయింబవళ్లు పనులు కొనసాగుతున్నప్పటికీ రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులకు ఈ ప్రాజెక్టు మిగతా 02లో

సాగర్ నీటిని దోచుకుంటున్న ఏపీ

సీఎం రేవంత్ ఏం చేస్తున్నారు?: కేటీఆర్

- రేవంత్ ఎందుకు మౌనం?
- తెలంగాణ నీటి హక్కులకు ముప్పు!
- సాగర్‌పై ఏపీ కుట్ర



2

బండ్ల గణేశ్‌కు

ఏడాది జైలు

చెక్ బౌన్స్ కేసులో రూ.95 లక్షల జరిమానా

- ఒంగోలు కోర్టులో నిర్మాతకు షాక్
- అప్పీల్‌కు నెల గడువు
- కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆదేశం



2

తెలంగాణ ఓటర్లకు

ఈసీ అలర్ట్

'సర్' ప్రక్రియ షెడ్యూల్ సవరించిన ఎన్నికల సంఘం



2

- ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు
- డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితా
- ఓటర్లకు మరో అవకాశం.. సవరించిన షెడ్యూల్

ఇదీ AI **ముద్ర**

ఆసియాన్ సదస్సులో ట్రంప్ సహా ప్రపంచ నేతలకు మోదీ కానుకలు..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 19 నవంబర్, 2026

సీతాఫలం: జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది

సీతాఫలంలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేయడంతో పాటు పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. మలబద్ధకం సమస్యను తగ్గించడంలోనూ ఉపయోగపడతాయి.





నిధులివ్వకుంటే కురుక్షేత్రమే


ముద్ర, నల్లగొండ :
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సొంత పార్టీ సర్కారుపైనే తీవ్ర అసంతృప్తి స్వరం వినిపిస్తూ కాంగ్రెస్‌లో మరోసారి ప్రకంపనలకు తెరలేపారు. నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల మంజూరులో ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్రమైన పక్షపాతం చూపుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమస్యలను పరిష్కరించి రావలసిన వాటా నిధులు కేటాయించకపోతే రాబోయే రోజుల్లో సర్కారుతో 'కురుక్షేత్రం' తప్పదని తేల్చిచెప్పారు. మునుగోడులో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, పాలన తీరుపై ఘాటు విమర్శలు గుప్పించారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కేవలం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకే నిధులు కుమ్మరించారని రాజ్‌గోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ అదే తరహా సంస్కృతి కొనసాగుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన కొడంగల్‌పై, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్‌పై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరపై మాత్రమే ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు తీసుకెళ్తున్న ప్రభుత్వం.. ఫ్లోరైడ్ బారినపడి ఏళ్ల తరబడి అల్లాడుతున్న మునుగోడు ప్రజల కోసం చెరువులు, కుంటలను బాగుచేసేందుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు.
డిండి ఎత్తిపోతల పథకం పనులు మూడేళ్లుగా పడకేయడంతో నల్గొండ ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నారని రాజ్‌గోపాల్ పేర్కొన్నారు. చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి హామీ ఇప్పటికీ అటకెక్కి ఉందని మండిపడ్డారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో వినతిపత్రాలు సమర్పిస్తే బుట్టదాఖలు చేస్తున్నారన్నారు. అదే ప్రజల ముందు ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యల పేరిట నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌కు కేటాయించే నిధులపై నిలదీస్తే 'పండబెట్టి తొక్కుతా' అంటూ మాట్లాడటం ఒక ముఖ్యమంత్రికి తగదని హితవు పలికారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని తేల్చిచెప్పారు.

సాగర్ డెడ్ స్టోరేజీపై కన్ను

(మొదటి పేజీ తరువాయి)
నిర్మాణంపై సమాచారం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలలుగా పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు గుర్తించలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
మరోవైపు కృష్ణా జలాల వినియోగంపై మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం అంగీకరించడం లేదనే అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం జలాల వినియోగంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఇప్పుడు నాగార్జునసాగర్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
తాగునీటి అవసరాల పేరుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల నాగార్జునసాగర్ జలాల వినియోగంపై ఎలాంటి ప్రభావం పడుతుంది? డెడ్ స్టోరేజీ నీటిని తరలించేలా నిర్మాణాలు చేపడుతున్నారా? ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు ఏమిటి? తెలంగాణ నీటిపారుదల శాఖకు ముందస్తు సమాచారం ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

సినీ నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు

ముద్ర, ఒంగోలు:
సినీ నిర్మాత బండ్ల గణేశ్ కు ఒంగోలు కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.95 లక్షల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 2018లో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన జానకి రామయ్య వద్ద బండ్ల గణేశ్ రూ.95 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే, జానకి రామయ్య మరణించడంతో.. ఆయన తండ్రి జెట్టి వెంకటేశ్వర్లుకి బండ్ల గణేశ్ 'పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్' పేరుతో రూ.95 లక్షల చెక్ ఇచ్చారు. ఆ చెక్ బౌన్స్ కావడంతో జెట్టి వెంకటేశ్వర్లు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం తాజాగా జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. బాధితుడికి కోర్టు ఖర్చులు కూడా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు కోర్టు నెల గడువు ఇచ్చింది.



గ్లోబల్ ఎకానమీలో భారత్ రికార్డు!

ముద్ర, డెస్క్:
ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నిలబడింది. 2026-30 కాలానికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ఆర్థిక నిలకడ (ఎకనామిక్ రెసిలియన్స్) కలిగిన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. చైనా, అమెరికా, జపాన్, జర్మనీ వంటి అగ్రరాజ్యాలను వెనక్కి నెట్టి భారత్ మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. అసోచామ్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) గణాంకాలను ఉటంకిస్తూ 'ఇన్ఫోఇన్‌డేటా' ఎక్స్ వేదికగా ఈ వివరాలను వెల్లడించింది.
స్థూల ఆర్థిక నిలకడ ర్యాంకింగ్స్‌లో భారత్ 100కి 71 స్కోరు సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. చైనా 66 స్కోరుతో రెండో స్థానంలో నిలవగా.. జపాన్, రష్యా 60 స్కోరుతో సంయుక్తంగా మూడో స్థానాన్ని పొందాయి. ఆ తర్వాత జర్మనీ 59, ఇటలీ, బ్రెజిల్ 53 చొప్పున, బ్రిటన్ 52, ఫ్రాన్స్ 40 స్కోరు సాధించాయి. ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా కేవలం 36 స్కోరుతో అట్టడుగున నిలవడం గమనార్హం. బాహ్య ఆర్థిక సంక్షోభాలను తట్టుకుని నిలబడే సత్తాను భారత్ నిరంతరం మెరుగుపరుచుకుంటోందని ఇన్ఫోఇన్‌డేటా పేర్కొంది.
కీలకమైన ఆర్థిక సూచీల్లోనూ భారతదేశం అద్భుత ప్రదర్శన కనబరిచింది. వాస్తవ జీడీపీ వృద్ధి రేటు (రియల్ జీడీపీ గ్రోత్), తలసరి జీడీపీ వృద్ధి, స్థూల పొదుపు (గ్రాస్ సేవింగ్స్) విభాగాల్లో భారత్ ప్రపంచంలోనే నంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. అలాగే గ్రాస్ క్యాపిటల్ ఫార్మేషన్, ఎగుమతుల వృద్ధిలో రెండో ర్యాంకును.. డెట్-టు-జీడీపీ నిష్పత్తిలో మూడో స్థానాన్ని సాధించింది.
దేశీయ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమైన స్థూల ఆర్థిక మూలాలతో ముడిపడి ఉందని అక్టోబరులోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు అంతర్జాతీయ సవాళ్ల నుంచి దేశాన్ని కాపాడాయని తెలిపింది. 2026-27 మొదటి అర్ధభాగంలో వాణిజ్య ఎగుమతులు రెండంకెల వృద్ధిని నమోదు చేయడంతో దేశ వాణిజ్య లోటు తగ్గింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), ఈసీబీలు, రెమిటెన్స్‌లు ఆగస్టులో గణనీయంగా పుంజుకున్నాయి. మరోవైపు ఐఎంఎఫ్ సైతం భారత వృద్ధి రేటు అంచనాను 60 బేసిస్ పాయింట్లు పెంచి 7 శాతానికి సవరించింది.



ఆర్థిక విపత్తు అంచున భారత్

ముద్ర, న్యూఢిల్లీ :
రెండు రోజుల అమెరికా పర్యటనలో ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ లో విద్యార్థులు, అధ్యాపకులతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం మరియు విద్యావ్యవస్థలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో తీవ్రమైన నిరుద్యోగ సమస్య నెలకొందని, భారత్ ప్రస్తుతం ఒక 'ఆర్థిక విపత్తు' అంచున కూర్చుని ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారతయువత ఎదుర్కొంటున్న సవాళ్లపై మోదరేటర్ లిడియా పోల్‌గ్రీన్ అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ బదులిస్తూ.. "నిజం కఠినంగా ఉన్నా చెప్పక తప్పదు.. భారత్ ప్రస్తుతం ఒక ఆర్థిక విపత్తుపై కూర్చుని ఉంది. మీడియా దీనిని పక్కన పెట్టవచ్చు, కొందరు విస్మరించవచ్చు. కానీ దేశంలో తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఉంది.
అలాగే మన విద్యావ్యవస్థలో లోతైన సమస్యలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. చదువుకున్న మధ్యతరగతి యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తమకు భవిష్యత్తు కనిపించకపోవడమే దీనికి ప్రధాన కారణమని రాహుల్ వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత తమ తల్లిదండ్రుల సలహాలను కూడా ప్రశ్నించే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు , వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని, కానీ నేడు ఆ వెన్నెముక విరిగిపోయిందని రాహుల్ విమర్శించారు. కేవలం సేవా రంగం ద్వారా అందరికీ ఉద్యోగాలు కల్పించడం అసాధ్యమని, తయారీ రంగాన్ని బలోపేతం చేయకపోతే దేశం మనుగడ సాగించడం కష్టమని అభిప్రాయపడ్డారు. కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తల వద్దే సంపద కేంద్రీకృతమవుతోందని ఆయన ఆరోపించారు.



నేడు ఇందిరమ్మ కుటుంబ బీమా ప్రారంభం

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న సార్వత్రిక జీవిత బీమా పథకం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నేడు సిద్ధిపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.
పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న నేతన్న, గౌడ, కార్మిక, మత్స్యకారులకు సంబంధించిన రూ. 2 లక్షల బీమా పథకాలను 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'లో విలీనం చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తి పేరిట జీవిత బీమాను నమోదు చేస్తారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నప్పటికీ, కేవలం ఒక్కరికి మాత్రమే బీమా చేయించుకునే అవకాశం ఉంటుంది. ఎవరిని నమోదు చేయించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవాలి. బీమా నమోదైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

అర్హతలు, గడువు వివరాలు ఇవే
వయోపరిమితి: ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన (అంటే 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించినవారు) సంపాదించే వ్యక్తుల్లో ఒకరిని నమోదు చేయాలి.
ధ్రువీకరణ: జనన ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుంటారు. బీమా పొందిన వ్యక్తి పాలసీ కాలంలో గరిష్ఠ వయోపరిమితిని (59 ఏళ్లు) దాటినప్పటికీ, కనీసం ఒక సంవత్సరం పాటు పూర్తి బీమా కవరేజీ లభిస్తుంది.
నమోదు గడువు: దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ రేపటి (నవంబర్ 19) నుంచే ప్రారంభమై, డిసెంబర్ 18లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ధీమా కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం చేశారు.

టీమ్ రేవంత్ 2.0

(మొదటి పేజీ తరువాయి)
ప్రాధాన్యత లభించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

మూడు మంత్రి పదవులకు భారీ పోటీ!
కేబినెట్‌లో ఖాళీగా ఉన్న మూడు స్థానాల కోసం ఆశావహులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు వంటి నేతల పేర్లు మంత్రి పదవుల రేసులో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సీనియారిటీతో పాటు పార్టీకి, ప్రభుత్వానికి ఎంతవరకు ఉపయోగపడతారనే అంశాలను కూడా అధిష్టానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. అయితే చివరి నిర్ణయం మాత్రం ముఖ్యమంత్రి, అధిష్టానం మధ్య జరిగే సంప్రదింపులపైనే ఆధారపడి ఉంటుంది.

2028 ఎన్నికలే లక్ష్యంగా టీమ్ రేవంత్ 2.0!
మూడేళ్ల పాలన ముగిసిన వెంటనే లేదా సంక్రాంతిలోపు కేబినెట్ విస్తరణ, ప్రక్షాళనపై స్పష్టత వచ్చే అవకాశముందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అంచనాలను అందుకోవడంతో పాటు, పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని తగ్గించడం, ప్రాంతీయ సమీకరణాలను సరిచేయడం రేవంత్ ముందున్న కీలక సవాళ్లు. ఈ నేపథ్యంలో తనకు పూర్తి సహకారం అందిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లగల నేతలతో కొత్త బృందాన్ని సిద్ధం చేయాలని సీఎం భావిస్తున్నారా అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి రాబోయే కేబినెట్ కూర్పు కేవలం మంత్రి పదవుల భర్తీ మాత్రమే కాకుండా.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో అధికార సమీకరణాలను మార్చే కీలక పరిణామంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. టీమ్ రేవంత్ 2.0 ఆవిర్భావంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలవుతుందా? అన్నది ఉత్కంఠ రేపుతోంది.

తెలంగాణ ఓటర్లకు
ఈసీ కీలక అలర్ట్

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 'సర్' ప్రక్రియ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార గడువు నవంబర్ 26 నుంచి డిసెంబర్ 15 వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే, గతంలో నవంబర్ 30న విడుదల కావాల్సిన తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 22, 2026న ప్రచురించనున్నట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, నాగాలాండ్, ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ కార్యదర్శి సందీప్ కుమార్ లేఖ జారీ చేశారు. ఓటర్ల జాబితాలో గైర్హాజరైన వారు, చిరునామా మారిన వారు, మరణించిన వారు, నకిలీ/డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించబడిన అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి ఈసీ ప్రత్యేక గణన చేపట్టింది.

ముఖ్యమైన తేదీలు ఇవే
నవంబర్ 18 – నవంబర్ 30: ASDD ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ మరియు సేకరణ ప్రక్రియ.
డిసెంబర్ 10: సేకరించిన ASDD ఫారాల పరిశీలన, పరిష్కారం పూర్తి.
డిసెంబర్ 15: నోటీసుల జారీ, సాధారణ క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల పరిష్కారానికి తుది గడువు.
డిసెంబర్ 22: తుది ఓటర్ల జాబితా అధికారిక ప్రచురణ.
ఈ సవరించిన షెడ్యూల్, ASDD ఓటర్ల గణన ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ వివరాలను రాతపూర్వకంగా తెలియజేయాలని ఎన్నికల సంఘం రాష్ట్ర అధికారులను ఆదేశించింది.



కూటమి ఐక్యతే లక్ష్యం

ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం

ముద్ర, అమరావతి:
స్థానిక ఎన్నికల్లో ప్రతి వార్డులోనూ కూటమి జెండా ఎగరాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తల్లి, చెల్లి వ్యక్తిత్వాన్ని కించపరిచే వారు రాజకీయాలకు అనర్హులని ఘాటుగా వ్యాఖ్యానించారు. వ్యక్తిత్వం లేని వారు చెల్లిని అగౌరపరిచేలా వ్యవహరిస్తూ రాజకీయ ముసుగులో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలను వివరించి ప్రతి ఎన్నికలోనూ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, రెండో దశ పట్టణ ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.
తెలుగుదేశం నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల వ్యూహంపై చర్చించారు. కూటమి ఐక్యత శాశ్వతంగా కొనసాగాలని, పొత్తు ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే ఈసారి గణనీయంగా పెరగాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఒక్క వార్డులో ఓడినా అందుకు గల కారణాలను విశ్లేషిస్తానని హెచ్చరించారు. గ్రామాలు, నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని పరిశీలించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చంద్రబాబు తేల్చి చెప్పారు.

సాగర్ నీళ్లను దోచుకుంటున్న ఏపీ



ముద్ర, హైదరాబాద్ :
నాగార్జున సాగర్ జలాల అంశం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడిని రాజేస్తోంది. సాగర్ బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సొరంగాలు తవ్వుతోందని వస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వం సాగర్ నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ముఖ్యంగా డెడ్ స్టోరేజ్ నుంచి నీటిని తీసుకోవడం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా నదిపై ఆధారపడిన తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా ఇలాంటి చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికే నాగార్జున సాగర్ జలాల వినియోగం, నీటి వాటాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి
తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలు కలిసి రాష్ట్రానికి అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. నాగార్జున సాగర్‌ను తెలంగాణకు దూరం చేసే కుట్ర జరుగుతోందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమవుతున్నారని, ముఖ్యంగా పాలమూరు, నల్గొండ జిల్లాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సాగర్ జలాల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఏపీ చేపడుతోందని ఆరోపిస్తున్న సొరంగాల నిర్మాణంపై అధికారిక వివరాలు, ప్రభుత్వ స్పందన వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? కేటీఆర్ ఆరోపణలకు అధికార పక్షం ఎలా సమాధానం చెబుతుంది? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.11.2026
www.mudranews.in | @mudranews

సీతాఫలం : రక్తపోటును నియంత్రించడంలో సాయం

ఈ పండులో ఉండే పొటాషియం, మెగ్నీషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా రక్తనాళాల పనితీరును మెరుగు పరచి, రక్తపోటు సమతుల్యంగా ఉండేందుకు దోహదపడతాయి.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో, మస్కట్ ఆవిష్కరణ



ముద్ర, మధిర: తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు సంబంధించిన లోగో, మస్కట్, బ్రోచర్ ను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఖమ్మం జిల్లా మధిరలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ వేదిక కావడం గర్వకారణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశ క్రీడా రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు, యువత, ప్రజలందరూ ఈ పోటీల విజయవంతంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఏసీబీ మూసివేసిన కేసులపై సమీక్ష జరపాలి



ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం, దర్యాప్తు నివేదికలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడంపై సమీక్ష జరపాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించాలని కోరుతూ ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏసీబీ సమగ్ర దర్యాప్తు జరిపి ప్రాసిక్యూషన్‌కు సిఫార్సు చేసిన కేసులను సచివాలయంలో అధికారులు నీరుగారుస్తున్నారని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణగా రూ.8 వేల లంచం తీసుకుంటూ 2023 ఏప్రిల్‌లో పట్టుబడిన ఓ పోలీస్ ఎస్ఐ కేసును ప్రస్తావిం చారు. మూడేళ్లపాటు ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచిన ప్రభుత్వం, 2026 జనవరి 27న జీఓ నం.88 ద్వారా ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించి కేసు ఉపసంహరణకు ఆదేశించిందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో అవినీతి అధికారుల్లో శిక్ష పడుతుందనే భయం తొలగిపోతుందని.. పరిపాలనలో అవినీతి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏసీబీ మూసివేసిన కేసులతో పాటు, సచివాలయంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ సమీక్షించాలని గవర్నర్‌ను కోరారు.

ముందు తెలంగాణ చరిత్ర గుర్తు చేసుకోండి

- మంత్రి ఉత్తమ్

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్రను విస్మరించి ఆమెపై విమర్శలు చేయడం కృతఘ్నత అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ నాయకత్వంపై మండిపడ్డారు. సోనియా గాంధీ నిర్ణయం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని, ఈ విషయాన్ని గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో అంగీకరించారని గుర్తుచేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మాజీ ప్రధాని నెహ్రూ కృషిని తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు.బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా బేసిన్‌కు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకున్నా రైతులకు తగిన ప్రయోజనం కలగలేదని విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తమ ప్రభుత్వం తెలంగాణకు 555 టీఎంసీల నీటి కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ ముందు వాదిస్తోందని తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏపీ ప్రతిపాదించిన పథకంపై ఇప్పటికే కృష్ణా బోర్డు, కేంద్ర జలశక్తి శాఖ, ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపామని వెల్లడించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో రేపటి నుంచి 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సదస్సును ప్రారంభిస్తారని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు దేశవ్యాప్తంగా రోడ్లు, హైవేల రంగానికి చెందిన సుమారు 3,500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సులో 19 సాంకేతిక సమావేశాలు, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక రహదారుల నిర్మాణం, ఏఐ సాంకేతికత, పర్యావరణహిత రోడ్లు, రహదారి భద్రత తదితర అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి 2026–27 బడ్జెట్‌లో రూ.5,677 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్–విజయవాడ హైవే విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు సహా పలు కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రోత్సాహక నిధుల్లో తెలంగాణకు అగ్రస్థానం

-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ముద్ర, హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు గుర్తింపు లభించింది. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం పథకం కింద రూ.1,087.64 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహక నిధులు సాధించి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల నమోదు, కేంద్ర ఫెర్టిలైజర్ సేల్స్ సిస్టమ్ ద్వారా ఎరువుల పంపిణీని విజయవంతంగా అమలు చేసినందుకు ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీకి రూ.422.64 కోట్లు, ఎరువుల పంపిణీ విధానానికి రూ.665 కోట్ల ప్రోత్సాహకం లభించిందన్నారు. ఫార్మర్ ఐడీ ద్వారా రైతులు ఎరువులను సులభంగా పొందడంతో పాటు పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కూడా వెసులుబాటు కలుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని మంత్రి అభినందించారు. రైతులకు మరింత మెరుగైన, సులభతరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఏఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అశోక్ దావలే, విజూకృష్ణన్

- కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి
- ఆఫీస్ బేరర్లుగా 27 మంది
- 86 మందితో సికేసి, 167 మందితో ఏఐకేఎస్ కమిటీ ఏర్పాటు



ఏ ఐ కే ఎస్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి



ఏ ఐ కే ఎస్ తెలంగాణ నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు

ముద్ర, హైదరాబాద్ : అఖిల భారత కిసాన్ మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అశోక్ దావలే, విజూ కృష్ణన్, కోశాధికారిగా పుష్పేంద్ర త్యాగి ఎన్నికయ్యారు. నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్ లో గల అచ్యుతానంద్ హాల్లోని శంకరయ్య వేదికగా జరుగుతున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మొత్తం 167 మందితో ఏఐకేఎస్ జాతీయ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో నుంచి 86 మందితో సెంట్రల్ కిసాన్ కౌన్సిల్ ను ఏర్పాటు చేశారు. 27 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా హన్నన్ మొల్లా, అమ్రారామ్, ఈపి జయరాజన్, అమల్ హల్దార్, ఏం. విజయ్ కుమార్, ఎస్.కే. ప్రీజా, ఇంద్రజిత్ సింగ్, జితేందర్ చౌదరి, బాదల్ సరోజ్, వినోద్ కుమార్, ముక్తసింగ్, డి.రవీందర్ ఉండనున్నారు. సంయుక్త కార్యదర్శులుగా పి. కృష్ణ ప్రసాద్, అవదేశ్ కుమార్, మరియం దావలే, కెవిన్ బాలగోపాల్, వల్సన్ పనోలి, అజిత్ నావలే, రతన్ దాస్, పరేష్పాల్, టీ. సాగర్, పోతినేని సుదర్శన్, స్వామి నటరాజన్, ప్రభాకర్ రెడ్డి ఉండనున్నారు.

తెలంగాణ నుంచి ఏఐకేఎస్ జాతీయ కమిటీలోకి 8 మంది ఎన్నికయ్యారు. అందులో టీ సాగర్, పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బి రాంబాబు, పి.జంగారెడ్డి, కందాల ప్రమీల మూడ్ శోభన్ ఉన్నారు. వీరిలో సికేసిలోకి టీ.సాగర్, పి.సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఏఐకేఎస్ జాతీయ కమిటీలోకి ఐదుగురిని తీసుకున్నారు. అందులో ప్రభాకర్ రెడ్డి, వి.కృష్ణయ్య, సూర్యనారాయణ, ఏం.హరిబాబు, బి బలరామ్ ఉన్నారు. వీరిలో నుంచి సీకేసీలోకి ప్రభాకర్ రెడ్డి, కృష్ణయ్య, ఎం హరిబాబును తీసుకున్నారు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో ముందున్నాం

ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపించాం
పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్ : ఎస్సీ, ఎస్టీలకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం MCRHRD లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే గారు, కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని సీఎం కమిటీకి వివరించారు. శాసన సభ స్పీకర్ గా, మంత్రులుగా దళితులకు రాజకీయంగా సముచిత అవకాశం కల్పించామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ తో పాటు వివిధ కార్పొరేషన్లలో అనేక అవకాశాలు కల్పించామని తెలిపారు. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా దళితుడికి అవకాశం కల్పించామన్నారు. ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీ లలో ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతీచోట ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయం లోనూ వారినే ప్రాధాన్యతగా తీసుకున్నామని వివరించారు. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతం పైగా ఎస్సీ, ఎస్టీల కోసం ఖర్చు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. వర్గీకరణ అమలు చేయడం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రిని కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాపీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, ప్రసాద రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ ను కలిసిన నాగిరెడ్డి

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కమిషనర్ గా నియమితులైన వై.నాగిరెడ్డి బుధవారం రోజున డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. శాఖను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు.

నేడు సిద్ధిపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ముద్ర, సిద్ధిపేట : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయనుండగా, ఇప్పటికే రూ.92.98 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

విద్యారంగానికి పెద్దపీట

దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. చిన్నకోడూరు మండలంలో రూ.7.50 కోట్లతో, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు కూడా శంకుస్థాపన చేయనున్నారు.

విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధి

జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో నిర్మించనున్న మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.సిద్ధిపేట జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నారు.



కొమురవెల్లి మల్లన్న భక్తులకు సౌకర్యాలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రాన్ని, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనాలను, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని, గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిద్ధిపేట జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలగించిన వీఓఏను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ముద్ర, నల్గొండ: వీఓఏలపై అధికారుల వేధింపులను అరికట్టి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో వీఓఏగా పనిచేస్తున్న అన్నపూర్ణను ఎలాంటి ఆరోపణలు లేకుండా రాజకీయ ఒత్తిళ్లతో విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆమెను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అన్నపూర్ణ తొలగింపును నిరసిస్తూ తిప్పర్తి మండల వీఓఏలు 13 రోజులుగా మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నారు. బుధవారం ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా వీఓఏలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పీడీ, ఏపీఎంలు కార్మికులపై ఒత్తిళ్లు తీసుకురావడం మానుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అన్నపూర్ణను విధుల్లోకి తీసుకోవాలని, అప్పటివరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యటల సోమన్న చిన్న పాక లక్ష్మీనారాయణ మండల కన్వీనర్ భీమగాని గణేష్ డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పోకల శశిధర్ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంత్రాల మంగమ్మ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి రుమాన జక్కుల అనిత మండల వివోఏలు అన్న పూర్ణ జయమ్మ, సంధ్య ,సువర్ణ ,లక్ష్మి నాగమ్మ, పుష్ప ,అన్నపూర్ణ ,రాణి, మౌనిక ,ప్రవంతి ,యాదమ్మ, మల్లయ్య ,రమణ, పరశురాములు, అశ్విని ,విజయభారతి, సునీత. అన్నపూ నాగరాజు మల్లయ్య జయమ్మ వసుమతి తదితరులు పాల్గొన్నారు



వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా ఎదిగిన చంద్రకాంత్ సాగర్

- కేటీఆర్ అభినందనలు

ముద్ర, హైదరాబాద్: 90 శాతం శారీరక వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసం, స్వయంకృషి, పట్టుదలతో పారిశ్రామికవేత్తగా ఎదిగి పలువురు దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్న ప్రణవ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చంద్రకాంత్ సాగర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. తెలంగాణ భవన్‌లో చంద్రకాంత్ సాగర్‌తో కేటీఆర్ ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ సాగర్ స్థాపించిన స్వయంకృషి ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ అందించిన సహకారం, ప్రోత్సాహంతో తన పరిశ్రమను అభివృద్ధి చేసుకున్నానని చంద్రకాంత్ సాగర్ తెలిపారు. తన విజయాన్ని వ్యక్తిగతంగా పరిమితం చేయకుండా, దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగులు ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా స్వయంకృషి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ సాగర్ సేవలను ప్రశంసించిన కేటీఆర్.. దివ్యాంగుల సాధికారత, స్వావలంబన కోసం ఫౌండేషన్ చేపట్టబోయే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

గురువారం,
19 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

వయసు పెరుగుతున్న కొద్దీ సమస్యలు
పెరుగుతున్నాయా?
అయినా నవ్వడం మానొద్దు!

ఆరోగ్యంపై ఆందోళనలు.. శరీరంపై పరిమితులు.. రోజుకో కొత్త సమస్య! వయసు పెరిగేకొద్దీ జీవితం ఎన్నో జాగ్రత్తల మధ్య సాగుతుంది. కానీ ఈ ఒత్తిళ్లన్నింటినీ పక్కనపెట్టి నవ్వుతూ బతకడమే అసలైన ఆరోగ్య రహస్యం. వయసు పెరగడం ప్రకృతి ధర్మం. దాన్ని ఎవరూ ఆపలేరు. అయితే వయసుతో పాటు వచ్చే మార్పులను ఎలా స్వీకరిస్తున్నామన్నదే మన జీవిత ఆనందాన్ని నిర్ణయిస్తుంది. ఒకప్పుడు ఏది పడితే అది తినేవాళ్లం. ఎంత దూరమైనా అలసట లేకుండా తిరిగేవాళ్లం. రాత్రంతా మేల్కొని ఉన్నా మరుసటి రోజు ఉత్సాహంగా పనులు చేసేవాళ్లం. కానీ వయసు పెరిగేకొద్దీ ప్రతి విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది.

చక్కెర తింటే షుగర్ భయం.. ఉప్పు తింటే బీపీ భయం.. నీళ్లు ఎక్కువ తాగితే బాత్రూమ్‌కు పరుగులు.. తక్కువ తాగితే డీహైడ్రేషన్ ప్రమాదం! తింటే బరువు పెరుగుతుందని ఆందోళన.. తినకపోతే నీరసం వస్తుందని భయం. వ్యాయామం చేస్తే ఒళ్లు నొప్పులు.. చేయకపోతే ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరికలు. మొత్తానికి ఏం చేసినా ఏదో ఒక సమస్య ఎదురవుతున్నట్లు అనిపిస్తుంది.

ఇక నిద్ర విషయంలోనూ అదే పరిస్థితి. ఎక్కువ నిద్రపోతే నడుం నొప్పి.. తక్కువ నిద్రపోతే రోజంతా నిద్రమత్తు. కాఫీ తాగితే నిద్రపట్టదేమోనని భయం.. తాగకపోతే ఉదయం ఉత్సాహమే ఉండదు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నంలో కొన్నిసార్లు జీవితాన్ని ఆస్వాదించడం మర్చిపోతున్నాం. ఈ పరిస్థితిని హాస్యంగా చూస్తే మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఉదయం నిద్రలేవడం అంటే కొత్త రోజు ప్రారంభం కాదు.. మరోసారి పునర్జన్మ ఎత్తినట్లే! మంచం దిగగానే చేతులు, కాళ్లు, మోకాళ్లు, నడుము.. ఏది సరిగ్గా పనిచేస్తుందో పరీక్షించుకోవాల్సిన పరిస్థితి. శరీరం ఇచ్చే సంకేతాలను అర్థం చేసుకుంటూ రోజు ప్రారంభించాల్సి వస్తుంది.

వయసు పెరిగిందని ఆనందానికి దూరం కావాల్సిన అవసరం లేదు. ఈ దశలో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా ఎంతో ముఖ్యం. మందులు, పరీక్షలు, ఆహార నియమాలు ఎంత అవసరమో.. మనుషుల మధ్య మాటలు, స్నేహితులతో సరదా సంభాషణలు, కుటుంబ సభ్యులతో గడిపే సమయం కూడా అంతే అవసరం. ఒంటరిగా నాలుగు గోడల మధ్య ఉంటూ ఆరోగ్య సమస్యల గురించే ఆలోచిస్తే మనసు మరింత అలసిపోతుంది. అందుకే అప్పుడప్పుడు స్నేహితులకు ఫోన్ చేయాలి. పాత జ్ఞాపకాలను గుర్తు



చేసుకోవాలి. మనసారా నవ్వుకోవాలి. చుట్టూ ఉన్నవారితో సరదాగా మాట్లాడాలి. వయసు పెరిగేకొద్దీ వస్తువులతో కూడా మాట్లాడుకునే పరిస్థితి వస్తుందని చెప్పే హాస్యం మరింత నవ్విస్తుంది. మైక్రోవేవ్, టోస్టర్‌తో కబుర్లు చెప్పుకోవచ్చు. వాషింగ్ మెషిన్ మాత్రం ఏ విషయాన్నైనా తిప్పి తిప్పి ముడి పెడుతుంది. ఫ్రిజ్‌ది చల్లని మనస్తత్వం. ఇస్త్రీ పెట్టె, ఓవెన్ చిన్న విషయానికే వేడెక్కిపోతాయి. ప్రెషర్ కుక్కర్ అయితే ఒత్తిడి పెరిగిందంటే ఈల వేసి మరీ తన అసహనాన్ని బయటపెడుతుంది!

ఇలాంటి చమత్కారాల వెనుక ఒక మంచి సందేశం ఉంది. వయసు పెరిగినా మనలోని హాస్య చతురత తగ్గకూడదు. జీవితాన్ని భారంగా కాకుండా తేలికగా తీసుకోవడం నేర్చుకోవాలి. ప్రతి చిన్న సమస్యను పెద్దదిగా భావిస్తూ ఆందోళన చెందడం కంటే, సాధ్యమైనంతవరకు నవ్వుతూ ముందుకు సాగాలి. నిజానికి 50 నుంచి 70 ఏళ్ల వయసును ఇంకా మధ్యవయసుగానే భావించవచ్చు. 70 నుంచి 80 ఏళ్ల జీవితంలోని బంగారు రోజులు. 80 నుంచి 90 ఏళ్లు అనుభవానికి ప్రతిరూపాలు. 90 దాటిన తర్వాత వయసు లెక్కలతో పనిలేదు.. ఆనందంగా బతకడమే ముఖ్యం. వయసు అనేది కేవలం అంకె మాత్రమే కాదు.. అది అనుభవాల సమాహారం. శరీరంలో మార్పులు రావచ్చు. నడక నెమ్మదించవచ్చు. ఆహారపు అలవాట్లు మారవచ్చు. కానీ మనసులో ఉత్సాహం, ముఖంలో చిరునవ్వు, మనుషులతో అనుబంధం మాత్రం తగ్గకూడదు.

చివరగా ఒక్క మాట.. జీవితంలో ఎన్ని సంవత్సరాలు బతికామన్నది కాదు ముఖ్యం. బతికిన ప్రతి సంవత్సరంలో ఎంత ఆనందాన్ని ఆస్వాదించామన్నదే ముఖ్యం. ఫ్రిజ్ ఇచ్చే చల్లదనం కంటే స్నేహితుడి పలకరింపులో ఉండే వెచ్చదనం గొప్పది. కాబట్టి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుందాం.. వయసును హాస్యంగా తీసుకుందాం.. మనుషుల మధ్య నవ్వుతూ జీవిద్దాం!

జిమ్‌కు వెళ్లకుండానే బరువు తగ్గొచ్చు

చలికాలంలో వ్యాయామం తగ్గడం, ఆకలి పెరగడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే సరైన ఆహారం, తగినంత నీరు, ఆరోగ్యకరమైన పానీయాలు, చిన్నపాటి వ్యాయామాలతో బరువును నియంత్రించుకోవచ్చు. కొబ్బరి నీళ్లు, హెర్బల్ టీలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. రోజువారీ జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకుంటే శీతాకాలంలోనూ ఫిట్‌గా ఉండవచ్చు.



భారతదేశంలో నవంబర్ నెలలో ప్రారంభమై ఫిబ్రవరి వరకు కొనసాగే శీతాకాలం, అత్యంత చల్లని వాతావరణాన్ని కలిగి ఉంటుంది. ఈ సీజన్‌లో ఉదయం నిద్రలేచి వ్యాయామశాలకు వెళ్లడం కొంత కష్టంగా అనిపిస్తుంది. ఇప్పటికే అధిక బరువు ఉన్నవారికి బద్ధకంతో వ్యాయామాలు వాయిదా పడటం సర్వసాధారణం. అయితే, ఈ కాలంలోనూ బరువు తగ్గడానికి సమర్థవంతమైన మార్గాలు ఉన్నాయి. చలికాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ బరువును అదుపులో ఉంచుకోవడానికి కొన్ని కీలకమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు అవసరం.

హైడ్రేషన్ కీలకం:

చలికాలంలో సాధారణంగా దాహం తక్కువగా అనిపిస్తుంది కాబట్టి, నీరు తాగడం తగ్గిపోతుంది. అయితే, ఇక్కడే ఒక ముఖ్యమైన విషయం ఉంది. శరీరానికి తగినంత నీరు అందకపోతే డీహైడ్రేషన్ ఏ ర్పడి, తరచుగా ఆకలిగా అనిపిస్తుంది. ఇది అనవసరమైన ఆహారాన్ని తీసుకోవడానికి దారితీస్తుంది, దీనివల్ల బెల్లీ ఫ్యాట్ తగ్గదు. కాబట్టి, చలికాలంలో ఖచ్చితంగా నీరు తాగాలి. చల్లటి నీరు తాగడం కష్టంగా అనిపి స్తే, గోరువెచ్చని నీటిని అలవాటు చేసుకోండి. గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీర ఊష్ణోగ్రత నియంత్రించబడి, రక్త ప్రసరణ పెరుగుతుంది. ఇది కొవ్వు కరగడానికి సహాయపడి, బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. అధ్యయనాల ప్రకారం, మీ శరీర ఉష్ణోగ్రత కంటే చల్లని నీరు తాగితే, శరీరం దానిని వేడి చేయడానికి సమయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియలో అవసరమైన క్యాలరీలు బర్న్ అవుతాయి. కాబట్టి, చల్లటి నీరు తాగగలిగితే మంచిది, లేకపోతే సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న నీటిని తాగడం అల వాటు చేసుకోండి.

ఆరోగ్యకర పానీయాలను ఎంచుకోండి

నీటితో పాటు, కొన్ని ఆరోగ్యకరమైన పానీయాలు శీతాకాలంలో బరువు తగ్గడానికి సహాయపడతాయి.

కొబ్బరి నీళ్లు

కొబ్బరి నీళ్లలో నీటితో పాటు పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. వ్యాయామానికి ముందు తేలికపాటి, రుచికరమైన పానీయం కావాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపిక. ఇది కొంతమేర పిండి పదార్థాలను కూడా అందిస్తుంది. చక్కెర కలపని నీళ్లు గ్లాస్ తీసుకోవచ్చు.

బీట్‌రూట్ రసం:

ఒక చిన్న బీట్‌రూట్‌ను శుభ్రంగా కడిగి నీటిలో కలిపి రసం తయారు చేసుకోవచ్చు. రుచి కోసం కొద్దిగా నిమ్మరసం కలపవచ్చు. ఇవి ఎంతో మంచివి.

హెర్బల్ టీలు:

చల్లని వాతావరణంలో చాలా మంది కాఫీ, టీ ఎక్కువగా తాగుతుంటారు. అయితే, చక్కెర, పాలు కలిపిన పానీయాలు ప్రమాదకరంగా మారవచ్చు. దీనికి బదులు గా బ్లాక్ టీ, హెర్బల్ టీలు (మందార టీ, ఊలాంగుటీ) ఎంచుకోండి. కాఫీలో కూడా యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీవక్రియ పెరిగి బరువు తగ్గడం సులభమవుతుంది. అంతేకాకుండా, ఈ హెర్బల్ టీలు మంచి అనుభూతిని ఇస్తాయి.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు:

చలికాలంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల ఆకలి పెరుగుతుందని తేలింది. దీంతో ఎక్కువగా వేయించిన, నూనెతో కూడిన ఆహారాన్ని తీసుకుంటాం, దీనివల్ల క్యాలరీలు పెరుగుతాయి. అలా కాకుండా, ఫైబర్ అధికంగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీ సుకోండి. ఇది శరీరానికి చాలా మంచిది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటివి మీ ఆహారంలో చేర్చండి.

చురుకుగా ఉండండి:

జిమ్‌కు వెళ్లి వర్కవుట్ చేయకపోయినా, ఇంట్లోనే చురుకుగా ఉండవచ్చు. మెట్లు ఎక్కి దిగడం, డ్యాన్స్ చేయడం, స్కిప్పింగ్ వంటివి చేస్తూ బరువు తగ్గవచ్చు. చిన్నపాటి శారీరక శ్రమ కూడా కేలరీలను బర్న్ చేయడానికి, జీవక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

ఈ చిట్కాలను అనుసరించడం ద్వారా శీతాకాలంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండవచ్చు. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించండి.

కోడిగుడ్డు పచ్చసొన తింటే చెడు కొవ్వు పెరుగుతుందా

కోడిగుడ్డు పచ్చసొన (Egg Yolk) తినాలంటే చాలామంది భయపడుతుంటారు. ఎందుకంటే దాంట్లో కొవ్వుల శాతం ఎక్కువగా ఉంటుందని, అది తినడంవల్ల రక్తనాళాల్లో చెడు కొవ్వు పెరుగుతుందని ఆందోళన చెందుతారు. కొవ్వు పెరిగితే రక్తనాళాలు మూసుకుపోయి గుండె జబ్బులు వస్తాయని జంకుతుంటారు. కోడిగుడ్డు పచ్చసొన (Egg Yolk) తినాలంటే చాలామంది భయపడుతుంటారు. ఎందుకంటే దాంట్లో కొవ్వుల శాతం ఎక్కువగా ఉంటుందని, అది తినడం వల్ల రక్తనాళాల్లో చెడు కొవ్వు పెరుగుతుందని ఆందోళన చెందుతారు. కొవ్వు పెరిగితే రక్తనాళాలు మూసుకుపోయి గుండె జబ్బులు వస్తాయని జంకుతుంటారు. ఒంట్లో కొవ్వు పెరిగి స్థూలకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందని మరికొంత మంది కోడిగుడ్డు పచ్చసొనను పక్కన పెడుతుంటారు. కానీ అది ఒట్టి అపోహ మాత్రమేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి కోడిగుడ్డు పచ్చసొనతో ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు.

ప్రయోజనాలు

కోడిగుడ్డు పచ్చసొన అధిక మొత్తంలో కొవ్వులు కలిగి ఉన్నప్పటికీ దాని ద్వారా రక్తంలో కొలెస్టరాల్ స్థాయిలు మాత్రం పెరుగవని హెల్త్ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు.

గుడ్డు పచ్చసొనను తినకపోవడం వల్ల ముఖ్య పోషకాలైన కొలైన్, సెలీనియం, జింక్‌తో పాటు విటమిన్ ఏ, బీ, ఈ, డీ, కే కూడా కోల్పోతారు. బి కాంప్లెక్స్, విటమిన్ డి లకు ప్రధాన వనరుగా గుడ్డును పేర్కొంటారు.

కోడిగుడ్డు పచ్చసొనలో ఐరన్ శాతం అధికంగా ఉంటుంది. దాన్ని మన శరీరం సులువుగా గ్రహిస్తుంది. అదేవిధంగా గుడ్డులో ఉండే ల్యూటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

అంతేగాక పలు జీవక్రియలు సక్రమంగా జరిగేందుకు గుడ్డులోని పోషకాలు సహకరిస్తాయి. పచ్చసొనలో కేలరీలు కూడా తక్కువే ఉంటాయి. కాబట్టి తిన్నా బరువు పెరుగుతారన్న బెంగలేదు. నిశ్చింతగా గుడ్డు మొత్తం తినొచ్చు.



నీ మంచి మనసే గొప్ప సంపద.
సహాయం చేయగలిగినప్పుడు చెయ్యి, ప్రతిఫలం ఆశించకు.
మానవత్వం మనిషికి ఆభరణం, సేవ పరమ ధర్మం.
ఇతరులకు తోడుగా ఉండు, వారి కష్టాల్లో పాలు పంచుకో.

పాజిటివ్ థాట్స్

- ఒంటరిగా ఉన్నప్పుడు బాధపడకు, అది నిన్ను బలోపేతం చేస్తుంది.
- నీతో నువ్వు గడుపు, నీ అంతరాత్మను తెలుసుకో.
- సమయాన్ని సద్వినియోగం చేసుకో, నీ కలలను సాకారం చేసుకో.
- ఒంటరితనం ఒక వరం, సరిగ్గా వాడుకుంటే.

విశ్వసనీయత గొప్ప గుణం, నమ్మకం బలమైన బంధం.
మాట తప్పకు, వాగ్దానాలను నిలబెట్టుకో.
నీపై నమ్మకం ఉంచిన వారిని గౌరవించు.
విశ్వాసమే జీవితానికి ఊపిరి.

వాళ్లు వెళ్లిపోతే
ఒక మనిషి మాత్రమే కాదు, ఒక ప్రపంచం వెళ్లిపోతుంది

ఒక్కసారి ఆలోచించండి..
ఇంకో 10–15 ఏళ్ల తర్వాత చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా ఉంటుందో..
మన తాతయ్యలు..
మన బామ్మలు..
మన అమ్మానాన్నలు..
మన బాబాయిలు,
పిన్నిలు..
ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతారు.
అప్పుడు మనం కేవలం కొంతమంది మనుషులను కోల్పోము...
ఒక జీవన విధానాన్ని కోల్పోతాం.
ఒక సంస్కృతిని కోల్పోతాం.
ఒక తరం జ్ఞాపకాలను కోల్పోతాం.
వాళ్ల ఉదయాలు వేరు...
సూర్యుడు ఉదయించక ముందే నిద్రలేచేవారు.
ఇంటి ముందు ముగ్గు వేసేవారు.
మొక్కలకు నీళ్లు పోసేవారు.
తోటలో పూలు కోసేవారు.
ఆ పూలను దేవుడి దగ్గర పెట్టేవారు.
దేవుడి పేరు చెప్పుకుని రోజు మొదలుపెట్టే వారు.
మనకు ఇవన్నీ ఇప్పుడు చిన్న విషయాల్లా అనిపించవచ్చు...
కానీ అదే వాళ్ల జీవితం.
దేవుడిని నమ్మేవారు.
దేవాలయానికి వెళ్లేవారు.
ఏకాదశి ఎప్పుడు?
అమావాస్య ఎప్పుడు?
పౌర్ణమి ఎప్పుడు?
అన్నది తెలుసుకోవడానికి వారికి మొబైల్‌లో రిమైండర్ అవసరం లేదు.
వారి మనసులోనే ఒక పంచాంగం ఉండేది.
వాళ్ల పలకరింపులు కూడా నిజమైనవే...
దారిలో ఎవరో కనిపిస్తే ఆగి,
"ఎలా ఉన్నావు? అంతా బాగుందా?"
అని అడిగేవారు.
అది మర్యాద కోసం కాదు.
మనస్ఫూర్తిగా అడిగేవారు.
ఎవరైనా అనారోగ్యంగా ఉన్నారని తెలిస్తే
వారి ఇంటికి వెళ్లి పరామర్శించేవారు.
ఎవరి ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగితే
తమ ఇంటి వేడుకలా భావించేవారు.


ఎవరికైనా కష్టం వస్తే
"నీకేం కావాలి?" అని అడిగేవారు.
ఈ రోజుల్లో మనకు వందల మంది Facebook friends ఉండొచ్చు...
కానీ ఇలాంటి మనుషులు ఎంతమంది ఉన్నారు?
వార్తాపత్రికను ఉదయం చదివేవారు.
మళ్లీ మధ్యాహ్నం తీసుకుని చదివేవారు.
సాయంత్రం కూడా ఒకసారి తిరగేసేవారు.
అది కేవలం వార్తల కోసం కాదు...
ప్రపంచంతో తమకున్న అనుబంధం కోసం.
ఫోన్ నంబర్లు?
చిన్న డైరీలో రాసుకునే వారు.
ఆ డైరీ ఎక్కడుందో కూడా వాళ్లకు తెలుసు.
మనకు వందల కాంటాక్ట్స్ ఉన్నా
మన పక్కింటి మనిషి నంబర్ తెలియకపోవచ్చు.
వాళ్లకు మాత్రం ఊరిలోని చాలామంది నంబర్లు గుర్తుండేవి.
వాళ్ల జీవితంలో ఆడంబరం లేదు...
పాత చెప్పులు.
సాధారణ బట్టలు.
మందపాటి కళ్లద్దాలు.
అయినా...
ఎవరినీ మెప్పించాలనే అవసరం వాళ్లకు ఉండేది కాదు.
ఉన్నదానితో సంతోషంగా ఉండేవారు.
సంతృప్తి అంటే ఏమిటో వాళ్లను చూస్తే అర్థమయ్యేది.
వేసవి వచ్చిందంటే...
ఇంట్లో ఊరగాయలు.
వడియాలు.
అప్పడాలు.
ఇంట్లోనే మసాలాలు.
నాటు టమాటాలు.
దేశీ వంకాయలు.
తాజా ఆకుకూరలు.
ఆహారంలో కేవలం రుచి కాదు...
ఒక తరం జ్ఞాపకం ఉండేది.
పండుగ అంటే కొత్త బట్టలు మాత్రమే కాదు...
అందరూ ఒకచోట చేరడం.
ఇంట్లో నవ్వులు.
పిల్లల అల్లరి.
అతిథుల రాక.
పక్కింటివారికి పిలుపు.
అందరూ కలిసి భోజనం చేయడం.
అదే పండుగ.
అదే ఆనందం.
అదే జీవితం.
కానీ...
ఆ ప్రపంచం నెమ్మదిగా మన కళ్ల ముందే కనుమరుగవుతోంది.
ఒక్కొక్కరుగా...
వాళ్లు వెళ్లిపోతున్నారు.
వాళ్లు వెళ్లిపోయినప్పుడు కేవలం ఒక కుర్చీ ఖాళీ కాదు...
ఒక ఇల్లు ఖాళీ అవుతుంది.
వాళ్ల గది ఖాళీ అవుతుంది.
వాళ్ల గొంతు వినిపించదు.
వాళ్ల పిలుపు వినిపించదు.
వాళ్ల చేతి వంట రుచి ఉండదు.
వాళ్లు చెప్పే పాత కథలు ఉండవు.
అప్పుడు మనకు అర్థమవుతుంది...
వాళ్లు మన జీవితంలో ఎంత పెద్ద భాగమో.
వాళ్లు వెళ్లిపోయిన తర్వాత వారి ఫొటో ముందు నిలబడి
ఎన్ని కన్నీళ్లు పెట్టుకున్నా...
వారితో మాట్లాడలేం.
అందుకే...
ఇప్పుడే మాట్లాడండి.
ఇప్పుడే కలవండి.
ఇప్పుడే వాళ్ల పక్కన కూర్చోండి.

వాళ్ల చిన్ననాటి కథలు అడగండి.
"మీ చిన్నప్పుడు ఎలా ఉండేది?" అని అడగండి.
వాళ్లు చెప్పే అదే కథను పదోసారి చెప్పినా వినండి.
ఎందుకంటే...
వాళ్లకు అది పాత కథ కావచ్చు.
కానీ రేపు అది మనకు దొరకని జ్ఞాపకం కావచ్చు.
వారితో కలిసి భోజనం చేయండి.
వారి చేతిని పట్టుకోండి.
కాసేపు వారి పక్కన మౌనంగా కూర్చున్నా సరే...
మీ సమయాన్ని ఇవ్వండి.
ఎందుకంటే మనం వారికి ఇచ్చే
ఖరీదైన బహుమతుల కంటే...
మన సమయమే వారికి ఎక్కువ విలువైనది.
ఒకరోజు...
వాళ్లు కూర్చునే కుర్చీ ఖాళీగా ఉంటుంది.
ఆ గదిలోకి వెళ్లినప్పుడు వారి వాసన గుర్తుకు రావచ్చు.
వారి గొంతు వినిపించినట్టుగా అనిపించవచ్చు.
అప్పుడు మనసులో ఒక్క మాట రావచ్చు...
'ఇంకొంచెం సమయం వాళ్లతో గడిపి ఉంటే బాగుండేది...'
ఆ బాధ రాకముందే...
వారితో సమయం గడపండి.
ఎందుకంటే...
మన పెద్దలు కేవలం మన కుటుంబ సభ్యులు కాదు.
వాళ్లు మన వేర్లు.
వాళ్లు మన చరిత్ర.
వాళ్లు మన సంస్కృతి.
వాళ్లే మన గతానికి, మన వర్తమానానికి మధ్య ఉన్న వంతెన.
వేర్లను మర్చిపోయిన చెట్టు ఎంత ఎత్తుకు ఎదిగినా...
ఎప్పటికో ఒకరోజు ఒంటరిగా మారుతుంది.
అందుకే...
వారిని ప్రేమించండి.
వారిని గౌరవించండి.
వారిని పలకరించండి.
వారిని దగ్గరగా ఉంచుకోండి.
వారికి మీ సమయాన్ని ఇవ్వండి.
రేపు సమయం ఉండకపోవచ్చు.
కానీ ఈరోజు... ఇంకా మన చేతుల్లోనే ఉంది.
మన పెద్దలను వారు మనతో ఉన్నప్పుడే ప్రేమిద్దాం.
వాళ్లు వెళ్లిపోయిన తర్వాత వారి విలువ తెలుసుకోవడం కంటే...
వాళ్లు మనతో ఉన్నప్పుడే వారి విలువను తెలుసుకోవడం మంచిది.
వాళ్లు మన మూలాలు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.11.2026
www.mudranews.in | @mudranews

సీతాఫలం : ఎముకలు, దంతాలకు బలాన్నిస్తుంది



సీతాఫలంలో కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే మెదడు, నాడీ వ్యవస్థ పనితీరుకు అవసరమైన పోషకాలను కూడా అందిస్తుంది.

భారతదేశపు ఉక్కు మహిళ

ఇందిరా గాంధీ జీవిత ప్రస్థానం

చారిత్రక ముద్ర

ముద్ర, హైదరాబాద్: భారత రాజకీయ చరిత్రలో అత్యంత శక్తివంతమైన, నిర్ణయాత్మకమైన నాయకురాలిగా నిలిచిన ఇందిరా ప్రియదర్శిని గాంధీ, భారత దేశపు మొట్టమొదటి మరియు ఏకైక మహిళా ప్రధానమంత్రి. "భారతదేశపు ఉక్కు మహిళ" (Iron Lady of India) గా ప్రసిద్ధి చెందిన ఆమె, తన దృఢమైన నిర్ణయాలు, దూరదృష్టి మరియు సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న తీరుతో ఆధునిక భారత రూపురేఖలను మార్చారు.బాల్యం మరియు రాజకీయ ప్రవేశం1917 నవంబర్ 19న ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో (ప్రస్తుత ప్రయాగ్‌రాజ్) జవహర్‌లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు ఇందిరా ప్రియదర్శిని జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో పెరగడం వల్ల చిన్నతనం నుంచే ఆమెపై జాతీయవాద భావాలు బలంగా నాటుకున్నాయి. శాంతి నికేతన్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయంలో మరియు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆమె విద్యాభ్యాసం సాగింది. 1938లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన ఆమె, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారు. 1942లో ఫిరోజ్ గాంధీని వివాహం చేసుకున్నారు; వీరికి రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ అనే ఇద్దరు కుమారులు కలిగారు.ప్రధాన మంత్రిగా పాలనా పగ్గాలు1964లో తండ్రి జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం, లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో ఇందిరా గాంధీ సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1966 జనవరిలో శాస్త్రి ఆకస్మిక మరణం తర్వాత, ఆమె భారత ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభంలో పార్టీలోని సీనియర్ నాయకులు ఆమెను "మూగ బొమ్మ" (Gungi Gudiya) అని తక్కువ అంచనా వేసినప్పటికీ, అనతికాలంలోనే పార్టీపై మరియు ప్రభుత్వంపై పూర్తి పట్టు సాధించి తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారు.చారిత్రక సంస్కరణలు మరియు కీలక నిర్ణయాలుఇందిరా గాంధీ పాలనా కాలం భారత ఆర్థిక, సామాజిక మరియు రక్షణ రంగాలలో పెను మార్పులకు వేదికైంది: ఆహార ధాన్యాల కొరతను అధిగమించేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ప్రోత్సహించి భారతదేశాన్ని ఆహార స్వయం సమృద్ధి దేశంగా మార్చారు.1969 సామాన్యులకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేసే లక్ష్యంతో 14 ప్రధాన వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు. 1971 పూర్వపు సంస్థానాధీశులకు ఇస్తున్న రాజభరణాలను (Privy Purses) రద్దు చేసి సామాజిక సమానత్వానికి బాటలు వేశారు.1971 భారత్–పాక్ యుద్ధం మరియు బంగ్లాదేశ్ అవతరణ తూర్పు పాకిస్తాన్‌లో జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజలకు అండగా నిలిచి, 1971 యుద్ధంలో పాకిస్తాన్‌పై చారిత్రాత్మక విజయం సాధించారు. ఈ విజయంతో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించింది. నాటి ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయి ఆమెను సాక్షాత్తు "దుర్గాదేవి"గా అభివర్ణించారు. 1974 రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో 'స్మైలింగ్ బుద్ధ' పేరుతో తొలి అణు పరీక్ష నిర్వహించి, భారత్‌ను అణ్వస్త్ర దేశాల సరసన నిలిపారు. ★ గరీబీ హటావో పేదరికాన్ని నిర్మూలించండి" (Garibi Hatao) అనే నినాదంతో పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు.అత్యవసర పరిస్థితి (Emergency) మరియు రాజకీయ పునరాగమనం1975లో అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నికను రద్దు చేస్తూ తీర్పునివ్వడం, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల ఆందోళనలు తీవ్రతరం కావడంతో 1975 జూన్ 25న దేశంలో అంతర్గత అత్యవసర పరిస్థితిని (Emergency) విధించారు. పౌర హక్కుల సస్పెన్షన్, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షల కారణంగా ఈ 21 నెలల కాలం భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పద అధ్యాయంగా నిలిచింది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. అయితే, జనతా పార్టీ ప్రభుత్వ అంతర్గత విభేదాల వల్ల 1980 ఎన్నికల్లో ఇందిరా గాంధీ తిరిగి ఘనవిజయం సాధించి నాలుగోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.1980వ దశకం ప్రారంభంలో పంజాబ్‌లో వేర్పాటువాద ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో (Golden Temple) ఆశ్రయం పొందిన సాయుధ వేర్పాటువాదులను ఏరివేసేందుకు 1984 జూన్‌లో ఆమె 'ఆపరేషన్ బ్లూ స్టార్' సైనిక చర్యకు ఆదేశించారు. ఈ చర్య సిక్కు సమాజంలో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది.దీనికి ప్రతీకారంగా, 1984 అక్టోబర్ 31న న్యూఢిల్లీలోని తన నివాసంలోనే ఆమె సొంత అంగరక్షకులు ఇద్దరు జరిపిన కాల్పుల్లో ఇందిరా గాంధీ వీరమరణం పొందారు. 1971లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' అందుకున్న ఆమె, మరణానంతరం కూడా ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన నాయకురాలిగా చిరస్థాయిగా నిలిచిపోయారు.



దేశం కోసం ప్రాణాలర్పించిన ధీశాలి ఇందిరాగాంధీ

భారతదేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకురాలు, పేదల ఆత్మ బంధువు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ధైర్యశాలి ఇందిరాగాంధీ అని స్మరించుకున్నారు. ఆమె చూపిన మార్గం, అమలు చేసిన సంక్షేమ విధానాలు నేటికీ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా దేశానికి ఆమె చేసిన సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. దేశం ఎన్నోక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోనూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న నాయకురాలు ఇందిరాగాంధీ అని చెప్పుకొచ్చారు. బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి కీలక నిర్ణయాలతో దేశ ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందిరాగాంధీ అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని సీఎం తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో ఆమె అమలు చేసిన పథకాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని చెప్పారు. సామాన్యులకు ఆర్థిక భద్రత కల్పించడం, పేదలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడం ఆమె పాలనలో ముఖ్యమైన అంశాలని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ ఆశయాలు, సంక్షేమ విధానాల స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4,092 కొత్త పెన్షన్ల మంజూరు



ముద్ర, కూకట్‌పల్లి :పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, మూసాపేట, బోయిన్‌పల్లి సర్కిళ్ల పరిధిలో ప్రభుత్వం కొత్తగా 4,092 పెన్షన్లను మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. బుధవారం మూసాపేటలోని ఆంజనేయ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులతో కలిసి లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. గడిచిన మూడేళ్లలో నియోజకవర్గంలో సుమారు 20,000 మందికి కొత్త రేషన్ కార్డులు అందించామని గుర్తు చేశారు.యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని ఆయన వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కోట్లాది రూపాయలతో సున్నం చెరువు, నల్ల చెరువుల సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే, రూ.180 కోట్లతో మూసాపేట వద్ద బ్రిడ్జి నిర్మాణం, జేఎన్‌టీయూ వద్ద స్కైవాక్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మహిళా, యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం..

19 మంది మృతి!




ముద్ర, రష్యా: రష్యాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. సైబీరియాలోని కెమెరోవో ప్రాంతంలో సైనిక రవాణా విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారు. రష్యా రక్షణ శాఖను ఉటంకిస్తూ అక్కడి ప్రభుత్వ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. మంగళవారం ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపింది. రష్యాకు చెందిన ఏఎన్–12 (An–12) సైనిక రవాణా విమానం నియమిత ప్రయాణంలో ఉండగా కెమెరోవో ప్రాంతంలోని యగునోవో గ్రామ సమీపంలో కూలిపోయింది. జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలను త్వరగా అదుపులోకి తీసుకొచ్చినట్లు ప్రాంతీయ గవర్నర్ ఇల్యా సెరెడ్యుక్ తెలిపారు. పోలీసులు ప్రమాద ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని ఇతరుల రాకపోకలను నిలిపివేశారు. దర్యాప్తు కోసం అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. హెలికాప్టర్‌తో పాటు వైద్య సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచినట్లు గవర్నర్ వెల్లడించారు.
విమాన ప్రమాదానికి సాంకేతిక లోపమే కారణమై ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై రష్యా విమానయాన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. విమానంలో ఏదైనా సరుకు ఉందా? అనే విషయం మాత్రం ఇంకా తెలియరాలేదు.కాగా, విమాన ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆకాశం నుంచి ఓ వెలుగుతున్న వస్తువు వేగంగా కిందకు పడిపోవడం, ఆ వెంటనే భారీ పేలుడు సంభవించినట్లు ఆ దృశ్యాల్లో కనిపించింది. పేలుడు ధాటికి పరిసర ప్రాంతం ఒక్కసారిగా వెలిగిపోయింది. అయితే విమానం కూలిన ప్రదేశం దూరంగా ఉండటంతో ప్రమాదానికి సంబంధించిన పూర్తి దృశ్యాలు అందులో కనిపించలేదు.

భూమికి ఒక లైట్ డే దూరంలోకి వాయేజర్-1

49 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం..!

ముద్ర, న్యూయార్క్ : అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా (NASA) ప్రయోగించిన వాయేజర్–1 (Voyager–1) అద్భుత రికార్డు నెలకొల్పింది. 1977లో ప్రయోగించిన ఈ ఖగోళ పరిశోధక వ్యోమనౌక (Space Craft) 49 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత భూమి నుంచి సరిగ్గా ఒక 'లైట్ డే (Light Day)' దూరంలోకి (కాంతి ఒక రోజులో ప్రయాణించే దూరానికి) చేరుకుంది. అంటే దాదాపు 2,600 కోట్ల కిలోమీటర్ల దూరం వెళ్లింది. దాంతో ఈ ఘనత సాధించిన తొలి మానవ నిర్మిత వస్తువుగా వాయేజర్–1 గుర్తింపు దక్కించుకుంది.ఈ వ్యోమనౌక అంతరిక్షంలో గంటకు సుమారు 61 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నదని నాసా వెల్లడించింది. సౌర వ్యవస్థ వెలుపలి ప్రాంతాన్ని, సూర్యుడి హెలియోస్ఫియర్‌కు ఆవలి ప్రాంతాలను, నక్షత్ర మండలాల మధ్య ఉండే విస్తారమైన అంతరిక్ష ప్రాంతాన్ని అధ్యయనం చేసేందుకు వాయేజర్ ప్రయోగ ప్రక్రియ నాసా చేపట్టింది. ఈ ప్రయోగ ప్రకియలో భాగంగా 1977 సెప్టెంబర్ 5న వాయేజర్–1 ను ప్రయోగించింది. అప్పటి నుంచి అది అంతరిక్షంలో ప్రయాణం కొనసాగిస్తూనే ఉన్నది. 1979లో గురుడు, 1980లో శని గ్రహాలను దాటేసిన ఈ పరిశోధక నౌక వాయేజర్–1 2012లో సౌర మండలాన్ని దాటి ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి వెళ్లింది. ఈ వ్యోమనౌక ఒక కాంతి సంవత్సరం దూరం వెళ్లడానికి మరో 18 వేల ఏళ్లు పడుతుందని నాసా అంచనా వేసింది.



ఇరాన్‌పై అమెరికా దాడులు

ఖేష్మ్ దీవిపై పలుమార్లు విరుచుకుపడ్డ అగ్రరాజ్యం

నివాస, వాణిజ్య ప్రాంతాలకు నష్టం లేదన్న ఇరాన్

టెహ్రాన్, నవంబర్ 17: స్వల్ప విరామం తర్వాత హొర్ముజ్ జలసంధిలోని ఇరాన్‌కు చెందిన ఖేష్మ్ దీవిపై అమెరికా మంగళవారం పలుమార్లు దాడులు చేసిందని హొర్ముజ్‌గాన్ ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ అహ్మద్ నఫీసీ తెలిపారు. బహ్రెయిన్‌లోని అమెరికా కేంద్రాలను ఇరాన్ మంగళవారం లక్ష్యంగా చేసుకున్న కొద్దిసేపటికే ఈ దాడులు జరిగాయి. గత నాలుగు రోజుల్లో బహ్రెయిన్‌పై ఇరాన్ చేసిన మూడో దాడి ఇదని సమాచారం. ఖేష్మ్ దీవిలోని నివాస, వాణిజ్య, మౌలిక సదుపాయాల ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగలేదని నఫీసీ తెలిపారు. అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, 'ఖేష్మ్ దీవిలోని ప్రాంతాలపై అమెరికా చేసిన దాడుల వల్ల నివాస, వాణిజ్య, మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం జరగలేదు' అన్నారు. సోషల్ మీడియా వీడియోల్లో దీవి నుంచి పొగలు ఎగిసిపడుతున్నట్లు కనిపించింది. 'ఖేష్మ్ దీవిలో పరిస్థితి అదుపులోనే ఉన్నది. సహాయక, సేవా, కార్యనిర్వాహక సంస్థలన్నీ పూర్తి అప్రమత్తతలో ఉన్నాయి' అని నఫీసీ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఖేష్మ్‌లో కనీసం ఐదు లేదా ఆరు పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ఐఆర్ఎన్ఏ తెలిపింది.

బహ్రెయిన్‌పై ఇరాన్ అటాక్


అంతకుముందు బహ్రెయిన్‌లోని అమెరికా రాడార్ వ్యవస్థ కేంద్రంపై డ్రోన్లతో దాడి చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించాయి. 'రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన యుద్ధ డ్రోన్లు మంగళవారం ఉదయం బహ్రెయిన్‌లోని షేక్ ఈసా ఎయిర్ బేస్‌లో అమెరికా దళాలు నిర్వహిస్తున్న రాడార్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని కచ్చితమైన ఆపరేషన్ నిర్వహించాయి' అని రివల్యూషనరీ గార్డ్స్ నిర్వహిస్తున్న సెపా వార్తా వెబ్‌సైట్ తెలిపింది. ఇరాన్ గగనతలాన్ని అమెరికా సైనిక డ్రోన్లు పదేపదే ఉల్లంఘిస్తున్నందుకు ప్రతిస్పందనగానే ఈ దాడి చేశామని సెపా వెబ్‌సైట్ పేర్కొన్నది. ఇటీవలి వారాల్లో ఇరాన్, అమెరికా మధ్య పరస్పర దాడులు క్రమంగా తీవ్రతరం అయ్యాయి. నవంబర్ 2న హొర్ముజ్ జలసంధిలోని కీలక దీవిపై అమెరికా దాడి చేసింది.2026 ఫిబ్రవరిలో అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి, ఇస్లామిక్ రిపబ్లిక్ అయిన ఇరాన్ అనుమతించిన మార్గాల్లోనే నౌకలు ప్రయాణించాలని టెహ్రాన్ పట్టుబడుతున్నది. అనుమతి లేని మార్గాల్లో వెళ్తున్నాయని తాను పేర్కొన్న నౌకలపై ఇరాన్ తరచూ దాడులు చేస్తున్నది. ఇటీవల జలసంధిలో నౌకలకు మంటలు అంటుకున్నాయని, అవి తరచూ మైన్లను తాకడం వల్లేనని ఇరాన్ పేర్కొంటున్నది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకాదళ దిగ్బంధనం విధించింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాల్లో సుమారు ఐదో వంతు రవాణా అయ్యే ఈ జలసంధి గుండా ట్యాంకర్ల ప్రయాణానికి అమెరికా సహకరిస్తున్నది. జలమార్గంలోని అన్ని మైన్లను తమ దళాలు తొలగించాయని అమెరికా తెలిపింది.

చేయూత పెన్షన్ పత్రాలు పంపిణీ



ముద్ర, శేరిలింగంపల్లి: నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణమండపంలో జరిగిన చేయూత పింఛన్ మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో గౌరవ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెం పాటి, గౌరవ మియాపూర్ సర్కిల్ డీసీ శ్రీనివాస్, మాదాపూర్ సర్కిల్ డీసీ బాలకృష్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్, తాజా మాజీ కార్పొరేట్లర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు మువ్వ సత్యనారాయతో కలిసి కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మియాపూర్, మాదాపూర్ సర్కిల్ పరిధిలోని 957 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరి పత్రాలను అందచేసిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ సామాజిక భద్రత ప్రతి ఒక్కరి హక్కు అనే నినాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పట్ల పెద్ద మనస్సుతో అండగా నీలుస్తూ చేయూత రూపంలో చేయూత నందిస్తున్న గొప్ప మహనీయుడు చైర్మన్ గాంధీ కొనియాడారు. శేరిలింగంపల్లి సర్కిల్ లబ్ధిదారులు –1080, చందానగర్ సర్కిల్ లబ్ధిదారులు –957, ఆల్విన్ కాలనీ సర్కిల్ లబ్ధిదారులు –1112, మొదటి విడతలో మంజూరయ్యాన్నారు.వీరిలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఈత, గీత కార్మికులు, చేనేత కారులు, పైలేరియా, డయాలాసిస్ బాధితులున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్‌ను హత్తుకున్న జిన్‌పింగ్.. చైనాకు ఎన్విడియా చిప్స్ బంద్



ముద్ర, షెంజెన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం ఆసియా పర్యటనలో ఉన్నారు. ఇవాళ ఆయన చైనాలోని షెంజెన్ చేరుకున్నారు. అక్కడ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్.. ట్రంప్‌కు స్వాగతం పలికారు. విమానం దిగిన తర్వాత ట్రంప్‌ను జిన్‌పింగ్ హత్తుకు న్నారు. ట్రంప్ రాక సందర్భంగా రెడ్‌కార్పెట్ పరిచారు. ఇదే సంవత్సరం జిన్ పింగ్ అమెరికాలో టూర్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వాషింగ్టన్‌లో విమానాశ్రయానికి వెళ్లి ట్రంప్ స్వాగతం పలికారు. అయితే ఎపెక్ సమావేశాల్లో పాల్గొనేందుకు ట్రంప్ షెంజెన్ చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి రేపు ముగ్గురు సమావేశంకానున్నారు. జపాన్ ప్రధాని సనేయి టకాయిచి కూడా షెంజెన్ చేరుకున్నారు. తొలిసారి ఆమె చైనాలో పర్యటిస్తున్నారు. తైవాన్ అంశంలో ఈ రెండు దేశాల మధ్య ఇటీవల మాటల యుద్ధం సాగింది.

మరో వైపు అమెరికాకు చెందిన ఎన్విడియా కంపెనీ తన ఏఐ చిప్స్ సరఫరాను చైనాకు నిలిపివేసింది. చైనా మహిళతో రిలేషన్‌లో ఉన్నట్లు చెప్పిన ఎన్విడియా సీఈవో జేన్సన్ హువాంగ్ కొన్ని రోజుల క్రితం ఆ కంపెనీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అలిస్ హువాంగ్ వ్యాపారి కాదు అని, ఆమెకు చైనా ఇంటెలిజెన్స్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. అయితే చిప్స్ తయారీలో నెంబర్ వన్ అయిన ఎన్విడియా.. తన కంపెనీ ఉత్పత్తులను చైనాకు అమ్మరాదు అని నిర్ణయించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.11.2026
www.mudranews.in | @mudranews

సీతాఫలం : శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది



సీతాఫలంలో సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా శక్తిని అందించి అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా జీవక్రియ సజావుగా సాగేందుకు, పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధికి ఇందులోని పీచు పదార్థాలు తోడ్పడతాయి.

మూడు గ్రామ సమైఖ్య భవనాలకు భూమి పూజ

నవాబుపేట మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం అన్న సర్పంచ్ గూళ్ళ రజిత రాజు



ముద్ర చిగురుమామిడి : రాష్ట్రం లో ప్రతి మహిళ అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని ప్రతి మహిళ మొహంలో ఆనందం చూడాలనే ఆకాంక్ష తో మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తుంది అని ఇందులో భాగంగానే నియోజక వర్గం లో మహిళా సంఘాలకు పక్క భవనాలు నిర్మించే క్రమంలో చిగురుమామిడి మండల నవాబుపేట గ్రామంలో ఒకే సారి మూడు గ్రామ సమైఖ్య భవనాలు 36 లక్షల నిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు ,గ్రామ మహిళా సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం లో మండల సింగిల్ విండో చైర్మెన్ చిట్టమల్ల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు మహిళా అభ్యుదయానికి కృషి చేస్తుంది అని అన్నారు.ఇట్టి మూడు మహిళా సమైఖ్య భవనాలకు గ్రామ రైతు పెద్దమనసుతో తక్కువ ధరకు భూమిని ఇచ్చి తన పెద్దమనసు చాటుకున్న కాంతాల మహిపాల్ రెడ్డి కి గ్రామ సర్పంచ్ మరియు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ భవన భూమి పూజ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గుళ్ళ రజితా రాజు ముఖ్య అతిథిగా పాల్గొనగా ఏ .పి .ఏం రజిత,సింగిల్ విండో చైర్మెన్ చిట్టమల్ల రవీందర్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు మర్మా రాజు, మండల నాయకులు సాంబారి బాబు, బడుకోలు దేవేందర్ , కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, మరియు వార్డు మెంబర్లు కాంగ్రెస్ గ్రామ నాయకులు వివిధ మహిళా సంఘాల మహిళా నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత బాబుకు సన్మానం

*** అభినందించిన సిద్దిపేట ఏసీపీ గడ్డం సదన్ కుమార్**
*** చిగురుమామిడి మండలం నవాబుపేటలో నాయకులు,దళిత సంఘాల భారీ ర్యాలీ**



ముద్ర చిగురు మామిడి : న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఇటీవల ప్రతిష్టాత్మక "అంబేద్కర్ నేషనల్ అవార్డు" అందుకున్న యువ నాయకుడు బోయిని బాబును సిద్దిపేట ఏసీపీ (సీసీఎస్) గడ్డం సదన్ కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించి,ఘనంగా సన్మానించారు.ఈ అవార్డు రావడాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భావజాల వ్యాప్తి కోసం బోయిని బాబు గత దశాబ్ద కాలంగా విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రదానం చేయడం తమ ప్రాంతానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణా ప్రతాప్ సింగ్, గొట్టి రఘుబాబు, వివిధ పార్టీల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిని ఆది మల్లయ్య, బోయిని సతీష్, బోయిని విజయ్ కుమార్, బోయిని మనోజ్, బోయిని వంశీకృష్ణ, బోయిని సురేష్, శంకర్, ఉమేష్, రఘు, పందిపెల్లి మహేష్, సంపత్, రాజయ్య, లింగయ్య, ఎనగందుల సంజీవ్, ఆంజనేయులు, నితిన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.కోటి విరాళం

ముద్ర, హైదరాబాద్: మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం అందించింది. బుధవారం ఫౌండేషన్ ప్రతినిధులు డీజీపీ సి.వి. ఆనంద్‌కు కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఈ నిధులను పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన విద్యా సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, ఏడీజీ అకున్ సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

22న తెలంగాణకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి సందీప్ రాక

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి బి.ఎం. సందీప్ ఈ నెల 22న రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరుల సమక్షంలో పీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. 23న కూడా హైదరాబాద్‌లోనే ఉండనున్న సందీప్.. సీఎం, మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ



ముద్ర, కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో 28 గ్రామాలకు చెందిన 608 మంది లబ్ధిదారులకు బుధవారం పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సిద్దిపేటలో ఇందిరమ్మ భీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు అడ్డంకులు లేని సమాజమే వికసిత భారత్ లక్ష్యం

సుగమ్య భారత్‌ను జాతీయ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి
ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రత్యేక నోడల్ అధికారి.. అందుబాటు సౌకర్యాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
న్యూఢిల్లీలో జాతీయ స్థాయి సదస్సులో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ సమక్షంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక ప్రతిపాదనలు



ముద్ర, న్యూఢిల్లీ : దివ్యాంగులు ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవిస్తూ సమాజంలోని అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందేలా అడ్డంకులు లేని వాతావరణాన్ని కల్పించడమే వికసిత భారత్ లక్ష్యం కావాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సుగమ్య భారత్ అభియాన్‌ను కేవలం మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమంగా కాకుండా దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం, స్వావలంబనకు భరోసా కల్పించే జాతీయ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సులో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సులో తెలంగాణ తరఫున హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 'సుగమ్య భారత్ – వికసిత భారత్' అంశంపై రాష్ట్ర అనుభవాలు, క్షేత్రస్థాయి సవాళ్లు, అమలుకు సాధ్యమైన కార్యాచరణ ప్రతిపాదనలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వికసిత భారత్–2047 లక్ష్య సాధనలో దివ్యాంగుల సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మెట్రో నగరాలు, విమానాశ్రయాలు, ప్రధాన రైల్వే స్టేషన్లకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అందుబాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు.ప్రభుత్వ భవనాలతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రజా రవాణా వ్యవస్థల్లో ర్యాంపులు, లిఫ్టులు, స్పర్శ ఆధారిత మార్గాలు, ప్రత్యేక మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన సౌకర్యాలు నిరంతరం వినియోగంలో ఉండేలా నిర్వహణ, పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు.

ప్రతి ప్రభుత్వ శాఖలో నోడల్ అధికారి.. ప్రత్యేక బడ్జెట్

ప్రతి ప్రభుత్వ శాఖలో అందుబాటు సౌకర్యాల కల్పన, నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని మంత్రి ప్రతిపాదించారు. ఆయా శాఖలు తమ వార్షిక బడ్జెట్‌లో ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించి, నిర్దిష్ట గడువుతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవనాల తనిఖీల్లో దివ్యాంగుల సంఘాలు, సాంకేతిక నిపుణులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం–2016ను పటిష్ఠంగా అమలు చేయాలని, కొత్త భవనాల నిర్మాణ అనుమతుల సమయంలోనే అందుబాటు ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ సేవలు దృష్టి, వినికిడి లోపాలు ఉన్నవారికి కూడా సులభంగా అందుబాటులో ఉండేలా సాంకేతిక మార్పులు చేపట్టాలని సూచించారు.

జాతీయ డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలు, ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాల స్థితిని పర్యవేక్షించేందుకు సమగ్ర జాతీయ డిజిటల్ వేదికను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రతి శాఖ తన పరిధిలోని భవనాల వివరాలు, అందుబాటు సౌకర్యాల స్థితి, పనుల పురోగతిని ఫొటోలతో సహా నమోదు చేయాలని ప్రతిపాదించారు. దివ్యాంగులు తమ సమస్యలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించి, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించే వ్యవస్థను తీసుకురావాలని కోరారు. ప్రైవేటు రంగంలోని ఆసుపత్రులు, హోటళ్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాల్లోనూ దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించేలా ప్రోత్సహించాలని, వారి ఉపాధి అవకాశాలను విస్తరించాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకుంటూ ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. దివ్యాంగులకు కల్పించే సౌకర్యాలు వయోవృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు, తాత్కాలికంగా నడవలేని పరిస్థితుల్లో ఉన్నవారికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని వివరించారు.తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులతో పాటు అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కట్టుబడి ఉందని, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధానాలు, మార్గదర్శకాల అమలుకు సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సాధికారతతోనే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది. అదే వికసిత భారత్–2047కు పునాది కావాలి అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

మేఘా ఇంజినీరింగ్ విలువ రూ.లక్ష కోట్లు!



ముద్ర, హైదరాబాద్: దేశీయ మౌలిక సదుపాయాల రంగంలో మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ అరుదైన మైలురాయిని చేరుకుంది. సంస్థ విలువ సుమారు రూ.లక్ష కోట్లకు చేరినట్లు సమాచారం. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలైన డీకే, హెచ్‌హెచ్, వర్డే పార్ట్‌నర్స్ భాగస్వామ్యంతో 700 మిలియన్ డాలర్ల పెట్టుబడుల సమీకరణకు ఒప్పందం కుదిరింది. ఇందులో నిర్మాణాత్మక ఈక్విటీ పెట్టుబడులతో పాటు రహదారి ఆస్తుల నగదీకరణ కూడా ఉంది. గ్రూప్‌కు చెందిన ఇంధన సంస్థ ఈపీటీఎల్ విలువను రూ.14 వేల కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుతం 20కి పైగా దేశాల్లో ప్రాజెక్టులు చేపడుతున్న మేఘా గ్రూప్.. రహదారులు, పంప్డ్ స్టోరేజ్, సౌర విద్యుత్, అణు విద్యుత్, చమురు, గ్యాస్ తదితర రంగాల్లో విస్తరిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి లభించిన ఈ మద్దతు భారత మౌలిక సదుపాయాల రంగంలో సంస్థ ప్రాధాన్యాన్ని చాటుతోంది.

ఏసీబీకి చిక్కిన పెద్దపల్లి జిల్లా పీపీ రవీందర్

ముద్ర, పెద్దపల్లి: ఓ కేసులో నిందితుడిని శిక్ష నుంచి తప్పించేందుకు లంచం డిమాండ్ చేసిన పెద్దపల్లి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) రవీందర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ధర్మారం మండలం రచ్చపల్లికి చెందిన భూ వివాదం, హత్య కేసులకు సంబంధించి ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో నిందితుడికి అనుకూలంగా వాదించేందుకు పీపీ పి.వి. రవీందర్ రూ. 2 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రూ. 1.50 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రణాళిక ప్రకారం బుధవారం ఉదయం బాధితుడు నేరుగా పీపీ నివాసానికి వెళ్లి రూ.1.50 లక్షలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడుల్లో పీపీ రవీందర్‌తో పాటు ఆయన అనుచరుడు రెడ్డి రాజుల రాజన్నను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తెలంగాణను తయారీ, వ్యాపార విస్తరణకు కేంద్రంగా మలచుకోండి

ముంబయి పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం



ముద్ర, ముంబయి : తెలంగాణలో తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముంబయి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ముంబయిలోనే ప్రధాన కార్యాలయాలను కొనసాగిస్తూ తెలంగాణలో ఉత్పత్తి, వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవాలని సూచించారు.ముంబయిలోని వర్లీలో ఫోర్ సీజన్స్ హోటల్‌లో బుధవారం సీఐఐ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' రోడ్‌షోలో మంత్రి మాట్లాడారు. ముంబయి నుంచి పెట్టుబడులను తరలించుకురావడం తమ ఉద్దేశం కాదని, అక్కడి సంస్థలు తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.తెలంగాణ, ముంబయి మధ్య తరతరాలుగా కొనసాగుతున్న వాణిజ్య, వ్యాపార సంబంధాలను గుర్తుచేసిన మంత్రి.. తెలంగాణ ప్రజలు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముంబయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సాంకేతిక రంగం, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఔషధ పరిశ్రమలు, వస్త్రాలు, దుస్తుల తయారీ, మీడియా, వినోద రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యమున్న మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను వినియోగించుకోవాలని సూచించారు.ముంబయి నుంచి తెలంగాణకు పెట్టుబడులు పెట్టే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని కేటాయిస్తామని శ్రీధర్‌బాబు ప్రకటించారు. తొలి చర్చల నుంచి పరిశ్రమల స్థాపన, కార్యకలాపాల ప్రారంభం, ఆదాయం ఆర్జించే దశ వరకు ఆ అధికారి సహకారం అందిస్తారని తెలిపారు. టీజీ–ఐపాస్ ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని వివరించారు.డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. 'రైజింగ్ టుగెదర్' నినాదంతో నిర్వహించనున్న ఈ సదస్సు తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి వేదికగా నిలవనుందని పేర్కొన్నారు.తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాల్లో భాగంగా 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా పట్టణ, పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల్లో సమతుల్య అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల, టీజీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు. అనంతరం మంత్రి ముంబయికి చెందిన పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడులు, వ్యాపార విస్తరణ, భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు.

హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రియేటివ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ రంగంలో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు: మంత్రి జూపల్లి



ముద్ర, హైదరాబాద్: యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ–ఎక్స్‌ఆర్) రంగాల్లో తెలంగాణకు అపార అవకాశాలు ఉన్నాయని, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి క్రియేటివ్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ రంగాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

బుధవారం హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో పరిశ్రమ ప్రముఖులతో నిర్వహించిన ఏవీజీసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7 నుంచి 13 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇండియా జాయ్–2026 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌తో కలిసి జరిగే ఈ కార్యక్రమం పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి 80 వేల మందికి పైగా సందర్శకులు, 8,500 మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు, 20కి పైగా దేశాల నుంచి ప్రముఖులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఏఆర్, వీఆర్ సాంకేతికతలతో తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని, పరిశ్రమలు, విద్యాసంస్థలు ఇండియా జాయ్‌లో చురుగ్గా భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, గ్రీన్ గోల్డ్ యానిమేషన్ డైరెక్టర్ టోమాజ్ వాల్జాక్, సీఎంఓ భరత్ లక్ష్మీపతి, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కవిత, రోటోమేకర్ సీఈఓ, టీవీఏజీఏ జనరల్ సెక్రటరీ, ఇండియా జాయ్ సహ వ్యవస్థాపకుడు మైక్ యాతం, పర్పుల్‌టాక్ సీటీఓ వంశీ, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్, ఎక్స్‌పీరియం చైర్మన్ రాందేవ్, ఇన్వెస్ట్ తెలంగాణ ఏవీజీసీ అండ్ ఆరెంజ్ ఎకానమీ డైరెక్టర్ వల్లభి ఏ. తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.11.2026
www.mudranews.in | @mudranews

సీతాఫలం : కంటి చూపునకు ఎంతో మేలు

సీతాఫలంలో ఉండే విటమిన్-ఎ కంటి ఆరోగ్యానికి అవసరమైన పోషకం. ఇది కంటి చూపును కాపాడటంతో పాటు కంటి కణజాలం సాధారణ పనితీరుకు తోడ్పడుతుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవాలనుకునే వారికి ఇది మంచి పండ్లలో ఒకటి.



నూతన పింఛన్ పత్రాలు పంపిణీ

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను ఏకే ప్యాలెస్‌లో బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు. భువనగిరి మండలంలో 1,044, భువనగిరి మున్సిపాలిటీలో 850 మందికి కలిపి మొత్తం 1,894 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని, అర్హులైన అనేకమంది పింఛన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి కల్పించిందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించిన గత ప్రభుత్వానికి, ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలకు చేయూత పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతగా భావిస్తోందన్నారు.భువనగిరి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, ఆత్మ కమిటీ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, భువనగిరి, చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్లు పక్కిర్ కొండల్ రెడ్డి, జీలుగు సతీష్ పవన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లంల జంగయ్య యాదవ్, కూర వెంకటేశ్, అన్ని గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కో –అప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్పృహ పెంపొందించాలి

సూర్యాపేట జిల్లాస్థాయి ఎన్నికల అక్షరాస్యత పోటీలు..
80 మంది విద్యార్థుల భాగస్వామ్యం



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 18: విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో సూర్యాపేట జిల్లాస్థాయి ఎన్నికల అక్షరాస్యత పోటీలను బుధవారం నిర్వహించారు. సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా నోడల్ అధికారి, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మార్గదర్శకత్వంలో, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత, ఓటరు నమోదు విధానం, ఎన్నికల సంఘం బాధ్యతలు, ఈవీఎంల పనితీరు, ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల్లో పౌరుల భాగస్వామ్యం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి (ఎస్సీ) నాలుగు నియోజక వర్గాల నుంచి మొత్తం 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల పాత్ర, ఎన్నికల పారదర్శకత, బాధ్యతాయుతమైన ఓటింగ్ వంటి అంశాలపై తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ప్రాధాన్యతను వివరించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈ క్లబ్స్ ద్వారా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, నైతిక ఓటింగ్ విధానాలపై నిరంతరం అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధువులతో పాటు సమాజంలోని ఇతరులకు కూడా ఎన్నికలపై అవగాహన కల్పించే యువ రాయబారులుగా మారాలని సూచించారు.

ఖేలో ఇండియా గేమ్స్ లోగో, గోడ పత్రిక ఆవిష్కరణ

ముద్ర ప్రతినిధి, మెదక్: రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరుగనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్ – 2026 లోగో, మస్కట్ గోడ పత్రికలను బుధవారం కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ...డిసెంబర్ 11 నుండి 22 వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ తో పాటు వరంగల్, నిజామాబాదు, ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్ పట్టణాలలో జాతీయ యువజన క్రీడలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మన రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ క్రీడలకు జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన, విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడలకు సంబంధించిన లోగో, మస్కట్ లను జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు, బస్సు స్టాండ్స్ వద్ద, రైల్వే స్టేషన్ తో పాటు ప్రధాన కూడళ్ళలో కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ



అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ గంగాల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని నీలిమ, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రంగాచారి , ఈడియం సందీప్ తదితరులు పాల్గొన్నారు.బీమా పథకం విస్తృత ప్రచారం చేయాలి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ, ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సభ్యుల్లో ఒకరికి మాత్రమే బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ వివరాల నమోదు పక్కాగా ఉండాలన్నారు. రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల వివరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా ప్రీ–ఫిల్ ఫారమ్‌ల రూపంలో ఉంటాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వివరాలను పూర్తి చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు అనంతరం ప్రింట్ అవుట్ తీసుకొని లబ్ధిదారుల సంతకాలు సేకరించి హార్డ్ కాపీలను భద్రపరచాలని ఆదేశించారు.రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక ఫారమ్‌ల ద్వారా సేకరించి, అర్హతలను పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఈడియం సందీప్, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపిడిపోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు ఎమ్.డి.అవేస్ చిస్తి అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ మనోహర్, డి.వై.ఎస్.ఓ. కె. ధనుంజయ, బాలేశ్వర్, టి. కృష్ణయ్య, అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా స్టేజి ఫియర్ (వేదిక భయం) పూర్తిగా తొలగిపోయి, భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగడానికి చక్కటి పునాది పడుతుందన్నారు. పుస్తకాలు కేవలం పరీక్షల్లో మార్కులు తెప్పించే సాధనాలు మాత్రమే కావని అవి మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే మహోన్నత నేస్తాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలి



ముద్ర ప్రతినిధి, మెదక్: ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛమైన ఓటర్ జాబితా ప్రాముఖ్యతపై అవగాహనకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ఓటర్ల జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియపై పిల్లలకు అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతకు వ్యాచరచన నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులలో ఓటర్ నమోదుపై అవగాహన, ఓటు యొక్క ప్రాముఖ్యత ఎలక్ట్రిక్ ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాసరచనలో ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ గఫర్, డీటీ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగమంచు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచనలు



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలో శీతాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యం లో ఉదయం, రాత్రి వేళల్లో రహదారులపై పొగమంచు ఏర్పడుతోంది. దీంతో ఎదురుగా, ముందు ప్రయాణిస్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదా లు జరిగే అవకాశం ఉందని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను స్పష్టమైన (గ్లాస్) వైజర్‌తో తప్పనిసరిగా ధరించాలి. హైబీమ్ లైట్లకు బదులుగా లోబీమ్ లైట్లను ఉపయోగించాలి.వాహన వేగాన్ని తగ్గించి, ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి. రిఫ్లెక్టివ్ జాకెట్లు, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఉపయోగించాలి. అకస్మాత్తుగా బ్రేకులు వేయకూడదు. రహదారి తడిగా ఉన్నప్పుడు వాహనం స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంది. మలుపులు తిరిగే ముందు ఇండికేటర్లు వేయాలి. పొగమంచు ఎక్కువగా ఉండే తెల్లవారు జామున, రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నివారించాలి. చలి నుంచి రక్షణతో పాటు వాహనంపై నియంత్రణ కోసం గ్లౌవ్స్ ధరించాలి.ఫోర్ వీలర్ వాహనదారులు ఫాగ్ ల్యాంప్స్ లేదా లోబీమ్ హెడ్‌లైట్లను మాత్రమే ఉపయోగించాలి. వాహన వేగాన్ని తగ్గించి నెమ్మదిగా, అప్రమత్తంగా నడపాలి. విండ్‌షీల్డ్‌పై ఆవిరి పేరుకుపోకుండా డిఫాగర్ ఉపయోగించాలి. పొగమంచులో హజార్డ్ లైట్లను నిరంతరం ఉపయోగించకుండా, అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు, మలుపుల వద్ద ఓవర్‌టేక్ చేయకూడదు. రహదారిపై లేన్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లను గమనిస్తూ ప్రయాణించాలి. ప్రయాణానికి ముందు టైపర్లు, లైట్లు, బ్రేకులు సక్రమంగా పనిచేస్తున్నాయో తనిఖీ చేసు కోవాలి. అకస్మాత్తుగా బ్రేకు లు వేయ డం, వేగంగా మలుపులు తిరగడం చేయకూడదని వివరించారు. వాహనదారులందరూ...ప్రయాణానికి ముందుగానే బయలుదేరాలి. తొందరపాటు ప్రయాణాలు చేయకూడదు.వాహన హెడ్‌లైట్లు, అద్దాలు శుభ్రంగా ఉంచుకోవాలి.ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలి. పొగమంచు కారణంగా రహదారి కనిపించని పరిస్థితుల్లో సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి, పరిస్థితులు మెరుగుపడిన తర్వాత ప్రయాణం కొనసాగించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదు.శీతాకాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రయాణాన్ని సురక్షితంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పిఎసిఎస్ ఆధ్వర్యంలో గోల్డ్ లోన్ సేవలను ప్రారంభం



ముద్ర, దేవరకొండ: కొండమలేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో రైతులు, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా గోల్డ్ లోన్ (బంగారు రుణం) సౌకర్యాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ , టీపీసీసీ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి మరియు పిఎసిఎస్ సీఈఓ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి గోల్డ్ లోన్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. గోల్డ్ లోన్ సేవల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా ప్రజలకు మరిన్ని ఆర్థిక సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ గోల్డ్ లోన్ సేవలను ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యులు ఏదుల బుచ్చయ్య, మారం అశోక్ రెడ్డి, గ్యార శ్రీను, గుండాబోయిన శ్రీనివాస్ యాదవ్,యాదగిరి రెడ్డి,సత్యనారాయణ, ఇస్లావత్ శంకర్ నాయక్, రాజు, అమర్ సింగ్, మగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్కూ్యపై ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ముద్ర ప్రతినిధి, మెదక్: కార్మిక హక్కుల సాధనకై డిసెంబర్ 1,2,3 తేదీల్లో అక్కూ్యపై ఢిల్లీ కార్యక్రమానికి మెదక్ జిల్లా కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి. బాలమణి, కార్యదర్శి ఏ. మల్లేశం, కోశాధికారి కే. నర్సమ్మ లు చలో ఢిల్లీ పోస్టర్ మెదక్ కేవల్ కిషన్ భవన్ లో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడుతూ...మోడీ అధికారంలోకి వచ్చాక కాకులను కొట్టి గద్దలకు వేసిన మాదిరిగా కార్మిక వర్గం శ్రమను దోచుకోవడానికి 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ ను తెచ్చారని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు వల్ల దేశంలో సంగటిత, అసంగటిత కార్మికులు, స్కీమ్ వర్కర్స్, ఎవరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు. నిత్యం కార్పొరేట్ సంస్థల సేవలో మునిగిన మోడీ



ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు దారదత్తం చేసిందని దుయ్యబట్టారు. కనీస వేతనం నెలకు రూపాయలు 42 వేలు నిర్ణయించాలని, ప్రమాదకర 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, స్కీమ్ వర్కరర్స్ ను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, సర్ ప్రక్రియ నిలిపివేయాలని, వివిజిరాంజీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్స్ తో జరిగే చలో ఢిల్లీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి




ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారికి మెరుగైన భద్రత కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.బుధవారం జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. జిల్లాలోని ప్రతి చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ)లో పిల్లలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించాలని, వారి సంరక్షణ, రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించి, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాల్లో తగిన ప్రాధాన్యతనిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చిలుకూరి శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి) సభ్యులు రుద్రమ, శివరాజు, ఇస్తారి, లేబర్ ఆఫీసర్ రాజు, డీఎల్ఎస్ఏ ప్రతినిధి సాయి శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ వీణ, డీఎంహెచ్ఓ ప్రతినిధి, సీడీపీఓలు స్వరాజ్యం, శైలజ, అనంతలక్ష్మి , జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, జిల్లాలోని అన్ని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల ప్రతినిధులు, చిన్నారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 19.11.2026
www.mudranews.in | @mudranews

సీతాఫలం : రోగనిరోధక శక్తిని పెంచుతుంది

సీతాఫలంలో విటమిన్-సి, విటమిన్-ఎతో పాటు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంలో సహాయపడతాయి.



మియాపూర్ భూములను ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ముద్ర, శేరిలింగంపల్లి: హైదరాబాద్ నగరంలోని మియాపూర్ భూములను ప్రజా ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని భాజాపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. భాజాపా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఛలో మియాపూర్' కార్యక్రమంలో రాంచందర్ రావు పాల్గొన్నారు. సర్వే నంబర్లు 100, 101 లలోని 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూములను అమ్మాలని నిర్ణయిస్తున్నట్లు ప్రకటించడంతో ఎం.ఏ.నగర్ కాలనీని సందర్శించారు. క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడే నివాసం ఉంటూ ఇల్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ మియాపూర్ పరిధిలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఆరోపించారు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 05 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు కలిపి మొత్తం సుమారు 550 ఎకరాల 39 గుంటల భూమి ఉంది. 1912 నాటి సర్వే రికార్డుల నుంచే ఇది సర్కారు భూమిగా నమోదై ఉంది. 1949లో జాగీర్ల రద్దుతో పూర్తిగా ప్రభుత్వ పరమైంది. ప్రైవేట్ వ్యక్తుల అక్రమ వాదనలను తోసిపుచ్చుతూ 2003లోనే హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. తాజాగా దశాబ్దాల న్యాయపోరాటానికి తెరదించుతూ సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడం శుభపరిణామం అని పేర్కొన్నారు.నియోజకవర్గంలో వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములను రియల్ మాఫియా పంచుకుంటున్నా ఎవరు నోరు మెదపడంలేదన్నారు, ఈ వేల కోట్ల విలువైన ఆస్తిని ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా, ఖజానా నింపుకోవడానికో లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారుల లాభాల కోసమో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టాలని చూడటం దుర్మార్గమని, ప్రస్తుతం ఈ విస్తీర్ణంలో సుమారు 150 ఎకరాల్లో పేద ప్రజలు ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ వంటి కాలనీలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, మిగిలిన 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ఈ భూములను అమ్మి సొమ్ము చేసుకునే బదులు, అన్ని హంగులతో కూడిన ఒక పెద్దాసుపత్రి, ప్రభుత్వ స్కూల్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల, ప్రజల ఆహ్లాదం కోసం పార్కులు మరియు నిరుపేదలకు పక్కా గృహనిర్మాణం వంటి ప్రజాహిత పనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు, ప్రజలకు అన్యాయం జరుగుతుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని, తరతరాలుగా గుడిసెలు, ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు, శేరిలింగంపల్లి ప్రజలారా, మన భూములను మనమే రక్షించుకుందామని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవడానికి, మీ తరపున అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని స్థానిక నివాసితులకు పూర్తి భరోసా కల్పించారు, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే శేరిలింగంపల్లి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలపై పోరాటం ప్రారంభిస్తామని, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరిస్తూ, ప్రజాభిప్రాయం కోరుతూ అభిప్రాయ సేకరణ పత్రాలను ప్రజలకు అందిస్తున్నామని మీ సంతకాలతో కూడిన పత్రాలను ముఖ్యమంత్రి, గవర్నర్ కు అందచేసి భూములను అమ్మకుండా అడ్డుకుందామని తెలిపారు, అన్ని పార్టీలు కలిసి పోరాడదామని మన భూములు కాపాడుకుందామని పిలుపునిచ్చారు, అవసరమైతే న్యాయ పోరాటమైన చేద్దామని స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు,ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు సింధు రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సీతారామ రాజు,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయేందర్ సింగ్, కార్యదర్శి మాణిక్ రావు, రాష్ట్ర నాయకులు నాగేశ్వర్ గౌడ్, రాఘవేంద్ర రావు, వసంత యాదవ్,నరేష్, టాక్ సభ్యులు బుచ్చి రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గణేష్ ముదిరాజ్, రమేష్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్,కృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, రాజు యాదవ్, రవి నాయక్, కిషోర్ , స్థానిక నాయకులు మన్యం, బాలు, ముకేష్, కిరణ్ , మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చల నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితేసేందుకు క్విజ్ పోటీలు

కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసేందుకు మెదక్ డిస్ట్రిక్ట్ క్విజ్ కాంపిటీషన్స్– 2026 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ క్విజ్ పోటీలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొంటారు.వారిలో విజ్ఞానం, తార్కిక ఆలోచనా సామర్థ్యం, జిల్లా పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలకు సమర్థ వంతంగా సిద్ధమయ్యేలా చేయాలనే ఉద్దేశంతో ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న మన్నారు. ప్రతి పాఠశాలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు పంపించారు. మండల స్థాయి క్విజ్ పోటీలు ఈనెల 20న మెదక్ జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించబడతాయి. ప్రతి మండలంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 8వ, 9వ, 10వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.జిల్లాలోని 21 మండలాల నుండి ఎంపికైన మొత్తం 63 మంది విద్యార్థులకు ఈనెల 26న జిల్లా స్థాయి సెమీఫైనల్ క్విజ్ పోటీలు నిర్వహించబడతాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 6 టీమ్‌లను ఫైనల్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుంది.జిల్లా స్థాయి ఫైనల్ క్విజ్ పోటీలు డిసెంబర్ 2న మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించబడతాయన్నారు. ఈ పోటీలు నర్సాపూర్‌వీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఆర్థిక సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫైనల్ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేయబడతాయి. ప్రథమ బహుమతి 90 వేలు, ద్వితీయ బహుమతి 60 వేలు, తృతీయ బహుమతి 30 వేలు ఇవ్వబడుతుంది.



మైనర్ల డ్రైవింగ్ పై 87 కేసులు నమోదు

హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన వారికి 92,639 చలాన్లు

ఎస్సీ డీవీ శ్రీనివాస్ రావు

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా వ్యాప్తంగా 2026 జనవరి నుంచి ఇప్పటివరకు మైనర్లు వాహనాలు నడిపిన ఘటనల్లో 87 కేసులు నమోదు చేసి రూ.42,500 జరిమానా విధించినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై 92,639 చలాన్లు నమోదు చేసి రూ.1,61,88,800 జరిమానా విధించినట్లు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిపై కోర్టుల ద్వారా జైలు శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉందని, ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు.

హయత్‌నగర్‌ను ఫ్యూచర్ సిటీలో కలిపితే సహించేది లేదు

ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి
ప్రభుత్వ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి
లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం
బీజేపీ నేత కుంట్లూరు వెంకటేష్ గౌడ్, బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్

ముద్ర, ఎల్బీనగర్: హయత్‌నగర్ మండలాన్ని ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ జిల్లాలో కలిపే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ ఉద్యమకారుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌ను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో మండల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బుధవారం వనస్థలిపురంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫ్యూచర్ సిటీ కేంద్రంగా దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై ప్రచారం జరుగుతోందని, ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, కల్వకుర్తి, దేవరకొండ నియోజకవర్గాలతో పాటు హయత్‌నగర్ ప్రాంతాన్ని కూడా చేర్చే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.హయత్‌నగర్‌కు ప్రత్యేకమైన భౌగోళిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యత ఉందని, హైదరాబాద్ శివార్లలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. అనేక కాలనీలు, గ్రామాలు, నివాస ప్రాంతాలు విస్తరిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజల అవసరాలు, సమస్యలు, భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పరిపాలనా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఉమ్మడి మూడు జిల్లాలకు చెందిన అనేక మంది ప్రజలు హయత్‌నగర్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. జనాభా, భౌగోళిక పరిస్థితులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. హయత్‌నగర్‌ను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలనే స్థానికుల ఆకాంక్షను ప్రభుత్వం గౌరవించాలని కోరారు.సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ పీపుల్స్ ఫెడరేషన్ హెచ్చరికహయత్‌నగర్ మండలాన్ని ఫ్యూచర్ సిటీ జిల్లాలో కలిపే నిర్ణయం తీసుకుంటే స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఘోర శ్యాంసుందర్ గౌడ్, మద్దిమడుగు రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మల్లేష్ యాదవ్, న్యాయవాది దినేష్ కుమార్, పందిరి వినోద్ గౌడ్, గుర్రం విజ్ఞాన్ రెడ్డి, ఎర్ర శ్రీహరి గౌడ్, గజ్జె శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారులు కారింగుల నరేందర్ గౌడ్, రాజనగర శ్రీకాంత్, పందుల వెంకటేష్ గౌడ్, ఉయ్యాల కుమార్ గౌడ్, కొంగరి కృష్ణ పద్మశాలి, మామిడి గిరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ము ద్ర, దేవరకొండ: కొండమల్లేపల్లి మండలంలోని గాజీనగర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ అధికారుల లక్ష్యమని తహసీల్దార్ నరేందర్ కుమార్ తెలిపారు. ఈ నెల 12న మండలంలోని గాజీనగర్ గ్రామాన్ని ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేనానాయక్ సందర్శించిన క్రమంలో గ్రామానికి సమీపంలో గల కంకర మిల్లునుంచి వెలువడే దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలుసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని పలువురు గ్రామస్థులు అతని దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన కమీషన్ సభ్యులు వెంటనే విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలో గ్రామ సభను నిర్వహించి ప్రజల నుంచి నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కంకరమిల్లు నుంచి వచ్చే దుమ్ము వల్ల సమీపంలో గల పంట పొలాలు దెబ్బతింటున్నాయని, మిషన్ భగీరథ ట్యాంకులో దుమ్ము చేరి అనారోగ్యానికి గురవుతున్నామని, రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లు తిరగడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ నవీన్ కుమార్, ఎంపీడీవో స్వర్ణలత, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు రాజకీయ పబ్బం గడుపుకునేందుకే

పదేళ్లు అధికారంలో ఉండి పాలమూరుకు ఏం చేశారు? సమాధానం చెప్పాలి
టీడీపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవరావు చౌదరి



ముద్ర, హైదరాబాద్: తెలంగాణకు, ముఖ్యంగా పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసింది తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలేనంటూ కేటీఆర్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవరావు చౌదరి విమర్శించారు. రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లయినా చంద్రబాబు నాయుడును లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు పాలమూరు, నల్గొండ జిల్లాల అభివృద్ధికి ఎందుకు తగిన చర్యలు తీసుకోలేదని కేటీఆర్, కేసీఆర్‌ను ప్రశ్నించారు. అప్పట్లో అభివృద్ధి చేయలేకపోవడానికి కారణాలేమిటో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.ఇప్పటికీ ఆంధ్ర, తెలంగాణ విభజన అంశాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేయాలని చూడటం సరికాదన్నారు. రాజకీయ అవసరాల కోసం ఒకసారి ఆంధ్ర, తెలంగాణ అంశాన్ని తెరపైకి తెస్తూ, మరోవైపు ఆంధ్రప్రదేశ్ నాయకులతో సన్నిహితంగా ఉంటున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి రోజా ఇంటికి వెళ్లి విందులు చేయడం, వైసీపీ నేతలతో స్నేహంగా మెలగడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.చంద్రబాబు చేతుల్లో రేవంత్ రెడ్డి, నరేంద్ర మోదీ ఉన్నారంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని అన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కొనే దమ్ము లేక చౌకబారు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.కేటీఆర్ ఇప్పటికైనా తన మాటతీరును మార్చుకోవాలని, లేదంటే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీని, తమ నాయకుడు చంద్రబాబు నాయుడును లక్ష్యంగా చేసుకుని చేసే అనవసర విమర్శలను మానుకోవాలని రాఘవరావు చౌదరి హితవు పలికారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఇటువంటి వ్యాఖ్యలను తగిన రీతిలో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

మాధవహిల్స్ లోనూ 'వర్క్ ఫ్రమ్ పార్క్' కాన్సెప్ట్



ముద్ర, శేరిలింగంపల్లి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఆదేశాల మేరకు మసీద్ బండలోని మాధవ హిల్స్ పార్క్‌ను "వర్క్ ఫ్రమ్ పార్క్" కాన్సెప్ట్‌గా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న పనులను మరియు ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాలను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పరిశీలించారు.ఐటీ నిపుణులు, ఫ్రీలాన్సర్లు, విద్యార్థులు మరియు స్టార్టప్ బృందాలు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా పనిచేసుకునేందుకు వీలుగా ఆధునిక, అందుబాటులో ఉండే మరియు పర్యావరణ అనుకూలమైన పని ప్రదేశాలను అవసరమైన సదుపాయాలతో ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ప్రతిపాదిత మౌలిక సదుపాయాలు మరియు కొనసాగుతున్న పనులను సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలు మరియు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చంద్రకళ మెమోరియల్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ – 2026 విజయవంతం

ముద్ర, కుషాయిగూడ: ఈషా టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రకళ మెమోరియల్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ 2026 నవంబర్ 15 దీన విజయవంతంగా ముగిసింది.ఈ టోర్నమెంట్‌లో సుమారు 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాల నుంచి చిన్నారులు ఈ పోటీలకు హాజరై తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ ట్రోబాల్ క్రీడాకారుడు శరణ్ పాస్కల్ విచ్చేసి చిన్నారులతో ముచ్చటించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా గౌరవ అతిథిగా అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు రిషబ్ మోహ్తా విచ్చేసి క్రీడాకారులతో మాట్లాడటమే కాకుండా వారితో కలిసి టేబుల్ టెన్నిస్ ఆడి చిన్నారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో మాట్లాడటం, వారితో ఆడటం చిన్నారులకు మంచి ప్రేరణగా నిలిచింది.దాదాపు 120 మంది క్రీడాకారుల భాగస్వామ్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల సహకారం, నిర్వాహకుల కృషితో ఈ టోర్నమెంట్ ఎంతో విజయవంతంగా ముగిసింది.ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, అతిథులు, వాలంటీర్లు మరియు శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. చంద్రకళ మెమోరియల్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ – 2026 ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస మోహన్ ఈషా టేబుల్ టెన్నిస్ అకాడమీ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555